మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 9-9-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 71 Issue: 71

09 సెప్టెంబర్ 2025 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:19 తిథిః విదియ సా. 6:28 వరకు తరువాత తదియ సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర సా. 5:57 వరకు తరువాత రేవతి యోగం గండ రా. 11:54 వరకు కరణం తైతుల ఉ. 7:51 వరకు గరజి సా. 6:28 వరకు వర్జ్యం తె. 5:05 నుండి ఉ. 6:33 వరకు దుర్ముహూర్తం రా. 11:02 నుండి రా. 11:49 వరకు రా. 11:02 నుండి రా. 11:49 వరకు రాహుకాలం మ. 3:16 నుండి సా. 4:48 వరకు యమగండం ఉ. 9:10 నుండి ఉ. 10:41 వరకు గుళికాకాలం మ. 12:13 నుండి మ. 1:44 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు మ. 2:07 నుండి మ. 3:36 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:37 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial

www.evarthalu.com



## నేడే ఉప రాష్ట్రపతి ఎన్నిక

**ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్**

**విపక్షాల నుంచి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ**

**ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్**

**సాయంత్రం 6 గంటలకు ఫలితం**

ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. రేపు పార్లమెంటు భవనంలో జరగనున్న ఈ ఎన్నికల పోలింగ్‌లో ఎన్‌డీఏ అభ్యర్థి, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు, విపక్ష 'ఇండియా' కూటమి ఉమ్మడి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డికి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. 2

## ఏజెంట్లుగా రామ్మోహన్ నాయుడు, కిరణ్ రిజిజు, శ్రీకాంత్ షిండే

2

## పోలింగ్‌కు దూరంగా బీఆర్ఎస్, బీజేడీ

2



2

## ఆపిల్ ఐఫోన్-17 ఎయిర్ నేడే లాంచ్

టెక్నాలజీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆపిల్ మెగా ఈవెంట్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం కాలిఫోర్నియాలోని స్టీవ్ జాబ్స్ థియేటర్‌లో 'ఆవ్ డ్రాపింగ్' పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది.




## కియా కార్లపై 4.5 లక్షలు తగ్గింపు

**ఎంజీ కార్లపై 3 లక్షల వరకు తగ్గింపు**

**ప్రకటించిన కంపెనీలు** 2

కేంద్ర ప్రభుత్వం సరళీకరించిన జీఎస్టీ 2.0 లాభాన్ని వినియోగదారులకు అందించడానికి మోటార్ వెహికిల్ ఇండస్ట్రీ కంపెనీలు ఉత్సాహం చూపుతున్నాయి. ఇప్పటికే అనేక బైక్, కారు కంపెనీలు జీఎస్టీ వ్యత్యాసాన్ని వినియోగదారులకు బదిలీ చేయడానికి సుముఖంగా ఉండగా, తాజాగా ఈ జాబితాలోకి కియా మోటార్స్ కూడా చేరింది.

### బంగారం, వెండి ధరలు

(హైదరాబాద్‌లో)

బంగారం (గ్రాము-24 క్యారెట్స్): రూ.10,838

వెండి (గ్రాము): రూ.137

ప్లాటినం (గ్రాము): రూ.3,901




# మూసీ ప్రక్షాళన చేస్తా

**హైదరాబాద్ తాగునీటి సమస్యను పరిష్కరిస్తా.. నల్లగొండ ఫ్లోరైడ్ సమస్యా లేకుండా చేస్తా**

**20 టీఎంసీల గోదావరి జలాలను తరలిస్తాం**

**16 టీఎంసీలు హైదరాబాద్ తాగునీటికి,**

**4 టీఎంసీలతో మూసీని ప్రక్షాళన చేస్తాం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ**

**తాగునీటి పథకం ఫేజ్2, 3కి శంకుస్థాపన**

మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గండిపేట వద్ద గోదావరి ఫేజ్ 2, 3 కి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ జల మండలి ఆధ్వర్యంలో నిర్మించిన 16 జలాశయాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇది ఇందిరమ్మ రాజ్యం.. పేదోళ్ల రాజ్యమని, ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): 1908 లో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించి నిజాం ప్రభుత్వం హైదరాబాద్ ప్రజలను వరదల నుంచి కాపాడిందన్నారు. వందేళ్లకు పైగా ఈ నగరానికి తాగు నీరు అందుతున్నాయంటే ఆనాటి నిజాం సర్కార్ దూరదృష్టినే కారణమన్నారు. కోటికిపైగా జనాభా ఉన్న హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంతో కృషి చేశాయన్నారు. 1965 లో మంజీరా నది నుంచి నగరానికి తాగు నీరు అందించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడించారు. 2002 లో కృష్ణా నదీ జలాలను మూడు దశల్లో నగరానికి తరలించి ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనన్నారు. కాంగ్రెస్ తెచ్చిన గోదావరి జలాలను నెత్తి మీద చల్లుకుని తామే ఏదో చేసినట్టు కొందరు నమ్మించారని, నెత్తిమీద నీళ్లు చల్లుకున్నంత మాత్రాన వాళ్ల పాపాలు తొలగిపోవని స్పష్టం చేశారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే గోదావరి జలాల తరలింపునకు ముందడుగు పడిందని, కాలుష్యమయమైన మూసీతో నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషతుల్యమైన మూసీని ప్రక్షాళన తరువాయి 2 వ పేజీలో...

**బ్లాక్ లిస్ట్ అయిన కంపెనీకి ప్రాజెక్టులు**

**విడతల వారీగా దోచిపెట్టే కుట్రకు ప్లాన్**

**కాళేశ్వరంపై కాంగ్రెస్ అబద్ధపు ఆరోపణలు**

**వాటిని రేవంత్ మామ కూడా తప్పుబట్టారు**

**కుంగిన పిల్లర్ పునర్నిర్మాణానికి ఎల్అండ్‌టీ రెడీ**

**పట్టించుకోకుండా సర్కారు కాలయాపన**

**ఏపీ బనకచర్ల కోసం రిపేర్లు చేయడం లేదు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




# అంతా మోసం

**మూసీ ప్రక్షాళన లక్ష కోట్ల స్కాం**

కాళేశ్వరం ప్రాజెక్టుపై చిల్లర ప్రచారం చేస్తున్నందుకు రేవంత్‌తో సహా కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరమన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): కాళేశ్వరంతో ఇప్పటిదాకా 240 టీఎంసీల నీటి వినియోగం జరిగిందని.. 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందన్నారు. 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా మేడిగడ్డ బరాజ్ కొట్టుకపోలేదు నిక్షేపంలా ఉందని.. మీరేమో (కాంగ్రెస్) కూలిపోయిందని అబద్దాలు చెపుతున్నారని మొన్న అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ ఎత్తిచూపారని.. 20 నెలలుగా బరాజ్లు ఎందుకు రిపేరు చేయడం లేదని కూడా అక్బరుద్దీన్ ప్రశ్నించారని గుర్తు చేశారు. మొదటినుంచి లక్ష కోట్ల అవినీతి అని కాళేశ్వరంపై కాంగ్రెస్‌లోని ప్రతి ఒక్కరూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. రూ.94 వేల కోట్ల ఖర్చు చేసిన ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుంది? కేటీఆర్ నిలదీశారు. ఇదంతా రాజకీయ తరువాయి 2 వ పేజీలో...

## డ్వాక్రా మహిళలకే బతుకమ్మ చీరలు



**రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

**'రేవంతన్న కానుక' పేరుతో పంపిణీ**

**ఒక్కో సభ్యురాలికి రెండు చీరలు**

**చేనేత సహకార సంఘాల నుంచి చీరల సేకరణ**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): బతుకమ్మ పండుగ సమీపిస్తున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం చీరల పంపిణీపై కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా అందిస్తున్న ఈ కానుక విషయంలో గత విధానానికి భిన్నంగా కొత్త నిబంధనలను అమలు చేయనుంది. ఈసారి 'అక్కా-చెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక' పేరుతో కేవలం స్వయం సహాయక తరువాయి 2 వ పేజీలో...

## ఈహెచ్ఎస్‌లో క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్!



**విధివిధానాల రూపకల్పనకు ప్రభుత్వం ఆదేశం**


హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధం అవుతోంది. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) విధి విధానాలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. ప్రతిపాదిత ఈహెచ్ఎస్ విధి విధానాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సోమవారం సచివాలయం సీనియర్ ఐఏఎస్ అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి అమలవుతున్న వివిధ పథకాలను, ఇన్సూరెన్స్ కంపెనీల విధానాలను అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరలో నివేదికను సిద్ధం చేయాలని తరువాయి 2 వ పేజీలో...



## 21 నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు

**ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం**

### విశ్వవాణి



వాతావరణ శాస్త్రవేత్త క్లెమెంట్ వ్రాగ్ తనకు నచ్చని రాజకీయ నాయకుల పేర్లతో సైక్లోన్లకు పేర్లు పెట్టేవారు. ఆ పొలిటీషియన్స్ కూడా వాటిలాగే విధ్వంసం సృష్టిస్తారన్న భావనతో ఆయన అలా చేసేవారు. కాలక్రమంగా అదే పద్ధతి కొనసాగుతోంది. అందుకే హరికేన్స్, సైక్లోన్స్‌కు మనుషులకు సంబంధించిన పేర్లే ఉంటాయి.



## 'స్వదేశీ' మేళాలు

**స్వదేశీ ఉత్పత్తులు ప్రోత్సహించండి**

**అవగాహన కార్యక్రమాలు చేపట్టండి**

**ప్రతి పార్లమెంట్‌లో స్వదేశీ ఉత్సవాలు**

**ఎన్డీయే ఎంపీలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి**

న్యూఢిల్లీ: భారతీయ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఎన్డీఏ ఎంపీలు స్వదేశీ మేళాలను నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అంతేకాదు, సవాళ్లను అధిగమించి ఎదిగేందుకు దేశం స్వయం సమృద్ధిని సాధించడం కీలకమని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో ఢిల్లీలో ఎన్డీఏ పార్టీల ఎంపీలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ, పలు వ్యాఖ్యలు చేశారు. భారత్ బలమైన దేశంగా ఎదుగుతున్న వేళ, కొన్ని సవాళ్లు తప్పవని తెలిపారు. అటువంటి సమయాల్లో ఆత్మనిర్భర్ స్ఫూర్తిని కొనసాగించాలని తరువాయి 2 వ పేజీలో...



## నేపాల్‌లో హింస.. 19 మంది మృతి

**సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా నిరసనలు**

**ఖట్మండులో హింసాత్మకంగా యువత ఆందోళనలు**

**పోలీసుల కాల్పులు.. 42 మందికి గాయాలు**

**పార్లమెంట్ ముట్టడికి యత్నం.. కర్ఫ్యూ విధింపు**

**ఇతర ప్రధాన నగరాలకూ పాకిన ఆందోళనలు**

ఖట్మండు: సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వం విధించిన నిషేధం నేపాల్‌ను రణరంగంగా మార్చింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ యువత చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. రాజధాని ఖాట్మండులో సోమవారం జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో

## రాశి ఫలాలు
9.9.2025

మేషం : ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. మాతృ వర్గ బంధువుల నుండి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. నిరుద్యోగులకు రావలసి అవకాశములు అందక నిరాశ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: ఇంట బయట సంతోషకర వాతావరణం ఉంటుంది. నూతన వస్తు వస్త్ర లాభాలు పొందుతారు. సంతాన విద్యా ఉద్యోగ విషయాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు. అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వాహన యోగం ఉన్నది.

మిధునం: మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ విషయంలో తొందరపాటు ఆలోచనలు ఇబ్బందికి గురిచేస్తాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృధా ఖర్చులు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులతో ఆధ్యాత్మిక, సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: ముఖ్యమైన పనులు ప్రారంభించి విజయం సాధిస్తారు. కుటుంబ విషయంలో నూతన ఆలోచనలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఉద్యోగుల కష్టం ఫలిస్తుంది.

సింహం: చేపట్టిన పనులలో అవాంతరాలు చికాకు పరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఆర్థిక వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. భాగస్వామ్య వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. గృహమున కొందరి ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది.

కన్య: ఋణ పరమైన సమస్యలు నుండి బయటపడతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులను పూర్తిచేస్తారు. వృత్తి, ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు. వ్యాపారాలలో అంచనాలను దాటి లాభాలు అందుతాయి.

తుల: బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నప్పటికీ సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక ఇబ్బందులు అధిగమించి దీర్ఘకాలిక ఋణాలు సైతం తీర్చగలుగుతారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

వృశ్చికం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో విశేషంగా పాల్గొంటారు.వృత్తి ఉద్యోగాలలో అరుదైన అవకాశములు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఇతరులపై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తికావు. బంధు మిత్రులతో చిన్న చిన్న విభేదాలు తప్పవు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

మకరం: నూతన వస్తు వాహన సౌకర్యాలు పొందుతారు. ధనపరంగా చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బంధు మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. దూర ప్రయాణ సూచనలున్నవి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. నిరుద్యోగ సమస్యలు పయిష్కారామౌతాయి.

కుంభం: ఇంట బయట మీ మాటకు విలుమఏరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. కీలక వ్యవహారాలలో సోదరుల సలహాలను తీసుకుని ముందుకు సాగడం మంచిది. సంతాన ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

మీనం: దీర్ఘ కాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.ధన విషయాలలో ఇతరులకు తొందరపడి మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ప్రారంభించిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉండి శిరో బాధలు పెరుగుతాయి.



# నేడే ఉప రాష్ట్రపతి ఎన్నిక

### ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్.. విపక్షాల నుంచి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ

**పార్లమెంటులో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్.. సాయంత్రం 6 గంటలకు ఫలితం**

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. రేపు పార్లమెంటు భవనంలో జరగనున్న ఈ ఎన్నికల పోలింగ్‌లో ఎన్‌డీఏ అభ్యర్థి, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు, విపక్ష 'ఇండియా' కూటమి ఉమ్మడి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డికి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఎన్నికల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి కాగా, అదే రోజు సాయంత్రం ఫలితం వెల్లడవుతుంది. గెలుపుపై ధీమాతో ఉన్నప్పటికీ, ఓట్లు చెల్లుబాటు కాకుండా పోతాయేమోనన్న ఆందోళన రెండు కూటముల్లోనూ కనిపిస్తోంది. 2022 ఎన్నికల్లో 15 ఓట్లు చెల్లకుండా పోవడంతో ఈసారి పార్టీలు మరింత జాగ్రత్త పడుతున్నాయి. ఇందులో భాగంగా బీజేపీ తమ ఎంపీల కోసం ఆది, సోమవారాల్లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తుండగా, కాంగ్రెస్ పార్టీ ఈ మధ్యాహ్నం మాక్ పోలింగ్ ద్వారా తమ ఎంపీలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పిస్తోంది. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విపక్ష ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. సంఖ్యాబలం పరంగా చూస్తే ఎన్‌డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. ఉభయ సభల్లోని 781 మంది సభ్యుల్లో ఎన్‌డీఏకు 425 మంది బలం ఉండగా, 'ఇండియా' కూటమికి 311 మంది సభ్యులున్నారు. వైసీపీ ఎన్డీయే అభ్యర్థికే మద్దతు ప్రకటించడంతో ఆ కూటమి బలం మరింత పెరిగింది. బీజేడీ మద్దతు కోసం ప్రధాని మోదీ ఆ పార్టీ అధినేత నవీన్ పట్నాయక్‌తో స్వయంగా మాట్లాడారు. బీఆర్ఎస్ తమ నిర్ణయాన్ని ఇంకా ప్రకటించాల్సి ఉంది. సంఖ్యాబలం తమకు అనుకూలంగా లేకపోయినా, రహస్య బ్యాలెట్ ఓటింగ్ కావడంతో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని విపక్షాలు ఆశలు పెట్టుకున్నాయి. మరోవైపు, తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌కు ఆ రాష్ట్ర ఎంపీల నుంచి మద్దతు లభిస్తుందని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రమంలో, తాను ఏ పార్టీకి చెందిన వాడిని కాదని, రాజకీయాలకు అతీతంగా తనను గెలిపించాలని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎంపీలందరికీ లేఖ రాశారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంటు భవనంలోని వసుధ కాంప్లెక్స్‌లో పోలింగ్ జరగనుంది. రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. ఓట్ల లెక్కింపు అదే రోజు సాయంత్రం 6 గంటలకు చేపట్టి ఫలితాన్ని వెల్లడిస్తారు.

## ఏజెంట్లుగా రామ్మోహన్ నాయుడు, కిరణ్ రిజిజు, శ్రీకాంత్ షిండే

న్యూఢిల్లీ: దేశ ఉప రాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధమైంది. జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఈ పదవి కోసం రేపు పోలింగ్ జరగనుంది. అధికార ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓటింగ్ ఏజెంట్లను నియమించింది. వీరిలో తెలుగుదేశం పార్టీకి చెందిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు మరో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు, ఎంపీ శ్రీకాంత్ షిండే ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పార్లమెంటు ఉభయ సభలకు చెందిన మొత్తం 781 మంది ఎంపీలు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో లోక్‌సభ నుంచి 542 మంది, రాజ్యసభ నుంచి 239 మంది సభ్యులు ఉన్నారు. అభ్యర్థి గెలుపొందాలంటే కనీసం 391 ఓట్లు సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుత బలాబలాలను పరిశీలిస్తే, ఎన్డీఏ కూటమికి 422 మంది సభ్యుల మద్దతు ఉంది. దీంతో వారి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు, ఇండియా కూటమికి 311 మంది సభ్యుల బలం ఉండగా, మరో 45 మంది ఇతరులు ఉన్నారు. తాను ఏ పార్టీకి చెందినవాడిని కాదని, పార్టీలకు అతీతంగా విజ్ఞతతో ఓటు వేయాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ జరిగి ఏమైనా సమీకరణాలు మారతాయా అని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు. అయినప్పటికీ, సంఖ్యాబలం దృష్ట్యా ఎన్డీఏ అభ్యర్థికే విజయావకాశాలు మెండుగా ఉన్నాయి.

# పోలింగ్‌కు దూరంగా బీఆర్ఎస్, బీజేడీ

హైదరాబాద్, భువనేశ్వర్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌కు దూరంగా ఉండాలని తెలంగాణకు చెందిన బీఆర్ఎస్, ఒడిశాకు చెందిన బిజూ జనతాదళ్ (బీజేడీ) నిర్ణయించాయి. తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ స్పష్టం చేసింది. ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడిన బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు సురేశ్ రెడ్డి ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. పార్టీ అధినేత కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే, అన్ని కోణాల్లో ఆలోచించి ఓటింగ్‌లో పాల్గొనకూడదని నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా కొరత రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని, ఈ సమస్యను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలుమార్లు కోరినా వారు విఫలమయ్యారని సురేశ్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వాల వైఫల్యానికి నిరసన తెలిపేందుకే ఈ మార్గాన్ని ఎంచుకున్నామని, బ్యాలెట్‌పై 'నోటా'కు అవకాశం లేనందున ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉంటున్నామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తోందని కూడా ఆరోపించారు. అటు.. బీజేడీ రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రా మాట్లాడుతూ.. అంశంపై పార్టీ ఎంపీలు, రాజకీయ వ్యవహారాల కమిటీతో చర్చించిన అనంతరం బీజేడీ అధినేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ ఈ తుది నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

# అంతా మోసం

మొదటి పేజీ తరువాయి

ఆరోపణ అని రేవంత్ రెడ్డికి పిల్లనిచ్చిన మామ పద్మారెడ్డి కొట్టిపారేసినా ఇంకా ముఖ్యమంత్రికి బుద్ధి రావడం లేదన్నారు. రూ.4000 కోట్ల నిర్మించిన మేడిగడ్డ బరాజ్లో భూసేకరణ, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అయిన వ్యయాన్ని తీసేస్తే 85 పిల్లర్లు ఉన్న బరాజ్ సిమెంట్ స్ట్రక్చర్ నిర్మాణానికే సుమారు రూ.2000 కోట్లు ఖర్చు అయ్యాయని.. కుంగిన మూడు పిల్లర్లు, ఏడవ బ్లాక్‌ను మాత్రం పునర్నిర్మాణం చేస్తే సరిపోతుందని.. ఈ విషయం ఎన్డీఎస్ఏ రిపోర్ట్‌లో కూడా స్పష్టంగా ఉందన్నారు. ఆ ఒక్క ఏడవ బ్లాకు నిర్మాణానికి రూ.250 నుంచి రూ.300 కోట్లు ఖర్చయ్యిందని.. ప్రభుత్వం నుంచి రూపాయి తీసుకోకుండా తామే సొంతంగా ఆ బ్లాకును పునర్నిర్మిస్తామని ఎల్ అండ్ టీ కంపెనీ చెప్పినా కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇందులో ప్రజాధనం ఎక్కడ వృథా అయ్యిందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు కోసమే మేడిగడ్డ బరాజ్‌ను రిపేర్ చేయించకుండా నీళ్లను కిందికి వృథాగా వదులుతున్నారని ఆరోపించారు. రూ.94 వేల కోట్ల ప్రాజెక్టులో 250 కోట్లు నష్టం జరిగితే, ఆ డబ్బుల్ని కూడా తామే సొంతంగా పెట్టుకుంటామని ఏజెన్సీ ముందుకు వస్తే పట్టించుకోకుండా లక్ష కోట్ల కుంభకోణం అని అబద్ధాలు ప్రచారం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముక్కు నేలకు రాసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 17 మే 2023 నాడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం రూ.1100 కోట్ల ఖర్చుతో గోదావరి జలాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చే పథకానికి రూపకల్పన చేశారని.. సముద్ర మట్టానికి 618 మీటర్ల ఎత్తులో కొండపోచమ్మ సాగర్ ఉంటే, 560 మీటర్ల ఎత్తులో మల్లన్న సాగర్ ఉంటుందని.. 540 మీటర్లు ఎత్తులో గండిపేట చెరువు ఉంటుందన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలను గ్రావిటీ ద్వారానే తేవొచ్చని.. అయితే గోదావరి, మూసీ అనుసంధానికి కొండపోచమ్మ సాగర్ సోర్స్ ని ఎందుకు తీసేసారో తెలియదు? లోగుట్టు పెరుమాళ్ళకే ఎరుక అన్నారు. రూ.1100 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును ఇవాళ రూ.7390 కోట్లకు పెంచారు అంటే దాదాపు ఏడు రెట్లు పెంచారు. ఎవరికోసం? ఎందుకోసం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.1100 కోట్లతో కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జిల్లాలను తీసుకొచ్చి రావల్ కోల్ చెరువును నింపి అక్కడి నుంచి గండిపేటకు గ్రావిటీ ద్వారా తీసుకురావొచ్చని.. కానీ రేవంత్ ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టు పేరు చెప్పి మూడు నీటి శుద్ధికేంద్రాలు, ఐదు పంప్ హౌస్‌లను కడుతుందని నిలదీశారు. ఎవరి లాభం కోసం కడుతున్నారు? కమీషన్లు దండుకోవడానికా? కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికా? ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. ఖజానాలో పైసలు లేక పథకాలు అమలు చేయడం లేదని చెప్తున్న రేవంత్ రెడ్డి మరోవైపు ప్రజాధనాన్ని దండుకుంటున్నాడని.. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు రెండు లక్షల కోట్లు అని మొన్న పార్లమెంట్‌లోనే కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా.. సిగ్గు లేకుండా మొన్న అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు రూ.8లక్షల కోట్లు, రూ.7లక్షల కోట్ల అప్పు అని నోటికి వచ్చినట్లు వాగారన్నారు. సంక్షేమ పథకాలు అమలుకు పైసలు లేవని చెప్తున్న ప్రభుత్వం రూ.7400 కోట్ల ప్రాజెక్టుకు అర్జెంటుగా శంకుస్థాపన ఎందుకు చేస్తుందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# మూసీ ప్రక్షాళన చేస్తా

మొదటి పేజీ తరువాయి

చేస్తానని నల్లగొండ జిల్లా ప్రజలకు ఆనాడే మాట ఇచ్చానని తెలిపారు. 20 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్ కు తరలించబోతున్నాం, ఇందులో 16 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటి కోసం వినియోగించబోతున్నామని, చెరువులను నింపుకుంటూ 4 టీఎంసీలను మూసీకి తరలించి మూసీని ప్రక్షాళన చేస్తామన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాలను హైదరాబాద్ తరలిస్తున్నాం, ఆ సంగతి మరిచిపోయి కొందరు మల్లన్నసాగర్ అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చేవెళ్లలో వైఎస్ ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాసుల కక్కుర్తితో తొలగించింది మీరు కాదా అని విమర్శించారు. చేవెళ్ల, తాండూరు, పరిగికి సాగునీరు అందకపోవడానికి కారణం మీరు కాదా అని బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. తుమ్మిడిహెట్టీ దగ్గర ప్రాణహిత చేవెళ్ల కట్టి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తామని వెల్లడించారు. గంగా నదీ, యమునా, సబర్మతీ నదులు ప్రక్షాళన చేయొచ్చు.. కానీ మేం మూసీ నదిని ప్రక్షాళన చేయొద్దా అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు ఎందుకు మూసీ నది ప్రక్షాళన చేపట్టలేదని, ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధికి అందరూ కలిసి రావాలని సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9 న తెలంగాణ సమాజానికి అంకితం ఇవ్వబోతున్నామని, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మా ప్రభుత్వం తిప్పికొడుతుందని స్పష్టం చేశారు.

# ఆపిల్ ఐఫోన్-17 ఎయిర్ నేడే లాంచ్

టెక్నాలజీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆపిల్ మెగా ఈవెంట్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం కాలిఫోర్నియాలోని స్టీవ్ జాబ్స్ థియేటర్‌లో 'ఆవ్ డ్రాపింగ్' పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. భారత కాలమానం ప్రకారం ఈ ఈవెంట్‌ను ఆపిల్ అధికారిక వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చు. ఈ ఈవెంట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్న ఐఫోన్ 17 సిరీస్‌ను ఆపిల్ ఆవిష్కరించనుంది. ఈసారి డిజైన్‌లో భారీ మార్పులు ఉంటాయన్న అంచనాల నడుమ ఈ ఈవెంట్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

# కియా కార్లపై 4.5 లక్షలు తగ్గింపు

### ఎంజీ కార్లపై 3 లక్షల వరకు తగ్గింపు.. ప్రకటించిన కంపెనీలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం సరళీకరించిన జీఎస్టీ 2.0 లాభాన్ని వినియోగదారులకు అందించడానికి మోటార్ వెహికిల్ ఇండస్ట్రీ కంపెనీలు ఉత్సాహం చూపుతున్నాయి. ఇప్పటికే అనేక బైక్, కారు కంపెనీలు జీఎస్టీ వ్యత్యాసాన్ని వినియోగదారులకు బదిలీ చేయడానికి సుముఖంగా ఉండగా, తాజాగా ఈ జాబితాలోకి కియా మోటార్స్ కూడా చేరింది. కియా ఇండియా ఇటీవల జీఎస్టీ 2.0 ప్రకటన అనంతరం, తన మొత్తం ఐసీఈ పోర్ట్‌ఫోలియోపై వినియోగదారులకు తాజా గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) తగ్గింపు ప్రయోజనాన్ని పూర్తిగా అందించనున్నట్లు ప్రకటించింది. తమ వాహన శ్రేణిపై రూ.4.48 లక్షల వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కియా కరెన్స్‌పై రూ.48,513, కార్నివాల్‌పై రూ.4,48,542 తగ్గించనున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 22 నుంచి సవరించిన రేట్లు అమల్లోకి రానున్నాయని పేర్కొంది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా కూడా తమ వాహన ధరలను రూ.54 వేల నుంచి రూ.3.04 లక్షల వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. తగ్గించిన ధరలు సెప్టెంబర్ 7 నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొంది.

# 'స్వదేశీ' మేళాలు

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. ఈ నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండని కోరారు. పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈ మేరకు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎంపీలు తమ నియోజకవర్గాల్లో మేడ్-ఇన్-ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ఉత్సవాలు నిర్వహించాలని, దీని కోసం నాయకత్వ పాత్ర పోషించాలని ఆయన కోరారు. జపాన్ వస్తువుల గురించి ఒకప్పుడు వారు గర్వించినట్లే, మేడ్-ఇన్- ఇండియా ఉత్పత్తులను కలిగి ఉన్నందుకు ప్రజలు గర్వపడాలని ఆయన అన్నారు. హాజరయ్యే ప్రతి కార్యక్రమంలో "స్వదేశీ" భాగం కావాలని మోదీ తెలిపారు. అదేవిధంగా జీఎస్టీ సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వ్యాపారులతో సమావేశాలు నిర్వహించండని ఎంపీలకు ప్రధాని మోదీ సూచించినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. తుఫాను వీచినా, తమ వాహనం టైర్లలో గాలిని నింపాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి ఒక ఉదాహరణగా చెప్పారు. అదే విధంగా, అనుకూలమైన వాతావరణం ఉన్నప్పటికీ సందేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి పని చేయాలని సూచించారు. అయితే ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో సరిగ్గా ఓటు వేసేలా ఎంపీలంతా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. పార్లమెంటు సభ్యులే తప్పు చేస్తే, అది కచ్చితంగా ప్రజల్లోకి తప్పుడు సందేశం వెళ్తుందని దిశా నిర్దేశం చేశారు. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్ సమావేశంలో పాల్గొన్నారు. సంఖ్యలు ఆయనకు అనుకూలంగా ఉండటంతో ఆయన విజయం దాదాపుగా ఖాయమైంది. బీజేపీ మిత్రపక్షాలతో పాటు కార్యక్రమానికి హాజరైన జేడీ(ఎస్) నాయకుడు, మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డీ దేవెగౌడను మోదీ అభినందించారు.

# డ్వాక్రా మహిళలకే బతుకమ్మ చీరలు

మొదటి పేజీ తరువాయి

సంఘాల (డ్వాక్రా) సభ్యులకు మాత్రమే చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. అంతేకాకుండా, ఒక్కో సభ్యురాలికి ఒకటి చొప్పున కాకుండా రెండేసి చేనేత చీరలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద ఈ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో ఆధార్ కార్డు ఉన్న 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఒక చీరను బహుమతిగా ఇచ్చేవారు. అయితే, రేవంత్ రెడ్డి సర్కార్ ఆ పద్ధతిని మార్చేసి, కేవలం డ్వాక్రా సంఘాల్లో క్రియాశీలకంగా ఉన్న మహిళలకే ఈ కానుకను పరిమితం చేసింది. దీనికోసం పట్టణ ప్రాంతాల్లో మెప్మా, గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఓ ద్వారా అర్హులైన సభ్యుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. చీరల సేకరణ బాధ్యతను చేనేత సహకార సంఘాలకు అప్పగించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోనే సుమారు 9 లక్షలకు పైగా చీరలు అవసరమని అధికారులు అంచనా వేశారు.

## ఈహెచ్‌ఎస్‌లో క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్!

మొదటి పేజీ తరువాయి

ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ వేతనం నుంచి కొంత డబ్బును జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నగదు రహిత ఆరోగ్య చికిత్స విధానం ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కేర్ అందించాలని ఉద్యోగులు కోరుతున్నారని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మొత్తం కలిపి 7 లక్షల 14 వేల 322 మంది ఈహెచ్‌ఎస్ ద్వారా లబ్ధి పొందనున్నారని సీఎస్ దృష్టికి తీసుకుపోయారు. ఈ పథకం కోసం ఏడాదికి సుమారు రూ.1300 కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో ఆయా రాష్ట్రాల్లో కొనసాగుతున్న విధి విధానాలను అధ్యయనం చేసి త్వరలో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి డా.యోగితా రాణా, ఆరోగ్య శాఖ కార్యదర్శి డా.క్రిస్టినా జెడ్ చోంగ్తు, , జీఏడీ కార్యదర్శి బెన్హర్ మహేశ్ దత్ ఎక్కా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 21 నుంచి అక్టోబర్ 3 వరకు

# దసరా సెలవులు

**ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు దసరా సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సెప్టెంబర్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. అక్టోబర్ 4వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇక జూనియర్ కాలేజీల విషయానికొస్తే సెప్టెంబర్ 28వ తేదీ నుంచి అక్టోబర్ 25వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. జూనియర్ కాలేజీలు అక్టోబర్ 26వ తేదీన పునఃప్రారంభం కానున్నాయి.

# నేపాల్‌లో హింస.. 19 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

9 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 42 మందికి పైగా గాయపడటంతో దేశవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ సహా 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను నిషేధిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా 'హమి నేపాల్' అనే సంస్థ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు సోమవారం ఉదయం ఖాట్మండులోని మైతిఘర్ వద్ద సమావేశమయ్యారు. "సోషల్ మీడియాను కాదు, అవినీతిని మూసేయండి," "మా భావప్రకటనా స్వేచ్ఛను హరించవద్దు" అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతీయ జెండాలు చేతబూని, జాతీయ గీతం ఆలపిస్తూ పార్లమెంట్ భవనం వైపు భారీ ర్యాలీగా కదిలారు. ఆందోళనకారులు పార్లమెంట్ భవనాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బారికేడ్లను దాటుకుని లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు మొదట టియర్ గ్యాస్, వాటర్ కానన్లను ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో న్యూ బానేశ్వర్ ప్రాంతం దద్దరిల్లింది. కాల్పుల్లో గాయపడిన వారిని సమీపంలోని సివిల్, ఎవరెస్ట్ ఆసుపత్రులకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 9 మంది మరణించినట్లు సివిల్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహన్ చంద్ర రేగ్మి ధ్రువీకరించారు. సోషల్ మీడియా నిషేధం తమ ఆగ్రహానికి తక్షణ కారణమే అయినప్పటికీ, దేశంలో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యవస్థాగత అవినీతే తమ ప్రధాన ఆందోళనకు కారణమని నిరసనకారులు స్పష్టం చేశారు. "ఈ నిషేధం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం.

**దేశ గౌరవం కోసమే నిర్ణయం : ఓలీ**

తాజా పరిణామాలపై నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ స్పందించారు. తమ ప్రభుత్వం సామాజిక మాధ్యమాలకు వ్యతిరేకం కాదని, దేశ చట్టాలను, గౌరవాన్ని కించపరిచే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. "నేపాల్ చట్టాల ప్రకారం రిజిస్టర్ చేసుకుని పన్నులు చెల్లించాలని ఏడాదిగా సామాజిక మాధ్యమ సంస్థలను కోరుతున్నాం. కానీ వారు మా రాజ్యాంగం తెలియదని బదులిచ్చారు. మహా అయితే నాలుగు ఉద్యోగాలు పోతాయేమో! ఆ నాలుగు ఉద్యోగాల కన్నా దేశ ఆత్మగౌరవం పెద్దది కాదా? కొన్ని ఉద్యోగాలు పోయినా కొత్తవి వస్తాయి" అని ఆయన తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఆగస్టు 25న నేపాల్ కేబినెట్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, దేశంలో పనిచేస్తున్న సామాజిక మాధ్యమ సంస్థలన్నీ వారం రోజుల్లోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించింది. సెప్టెంబర్ 3తో గడువు ముగియడంతో, రిజిస్టర్ చేసుకోని ఫేస్‌బుక్, 'ఎక్స్', యూట్యూబ్, వాట్సాప్ సహా మొత్తం 26 ప్రముఖ ప్లాట్‌ఫామ్‌లను సెప్టెంబర్ 4 నుంచి ప్రభుత్వం నిలిపివేసింది.

# నేత్రదానానికి ఆర్టీసీ అండ

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): సామాజిక బాధ్యతలో భాగంగా నేత్రదానానికి టీజీఎస్ఆర్టీసీ తోడ్పాటు అందిస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన నేత్రాలను ఉచితంగా తమ బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే 'నెట్‌వర్క్ టు సైట్' పేరుతో సరోజిని దేవి కంటి ఆస్పత్రితో టీజీఎస్ఆర్టీసీ ఒక ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్ మెహిదిపట్నంలోని సరోజిని దేవి కంటి ఆస్పత్రి ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నేత్రదాతల నుంచి సేకరించిన కార్నియాలను ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా హైదరాబాద్‌కు పంపిస్తారు. సేకరించిన కార్నియాలను ఐస్ బాక్స్‌లో భద్రపరిచి ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందజేస్తారు. వాటిని తమ బస్సుల్లో హైదరాబాద్‌కు ఆర్టీసీ డ్రైవర్లు తీసుకువస్తారు. బస్సులు హైదరాబాద్ చేరుకోగానే సరోజిని కంటి ఆసుపత్రి సిబ్బంది వచ్చి వాటిని తీసుకుని ఐ బ్యాంక్‌లలో భద్రపరుస్తారు. టీజీఎస్ఆర్టీసీ




ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. పవిత్రమైన ఈ దాతృత్వ కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని అన్నారు. 'నెట్‌వర్క్ టు సైట్' పై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వ్యక్తి మృతిచెందిన తర్వాత అత్యంత విలువైన అవయవాలను వృథా చేయడం కంటే అంధత్వంతో లోకాన్ని చూడలేని వారికి చూపునీయడం గొప్ప కార్యమని అన్నారు. భారతదేశంలో ప్రతి ఏటా 3 లక్షలకు పైగా మంది నేత్రాల కోసం ఎదురుచూస్తుంటే.. కేవలం 18 వేల మార్పిడిలు మాత్రమే జరుగుతున్నాయని చెప్పారు. మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సరోజిని దేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని మాట్లాడుతూ.. కార్నియాలను బస్సుల్లో ఉచితంగా తరలించేందుకు ముందుకు వచ్చిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా కార్నియాలను సరోజిని కంటి ఆస్పత్రికి తీసుకువచ్చి అవసరమైన వారికి మార్పిడి చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నేత్రదాన ప్రతిజ్ఞ చేశారు. నేత్రదాన ప్రతిజ్ఞా పత్రంపై సంతకం చేసి సరోజిని దేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదినికి అందజేశారు. అంతకుముందు నేత్రదానంలో కీలకపాత్ర పోషిస్తోన్న జీవన్‌దాన్ కోఆర్డినేటర్లు రియాజుద్దీన్, విశ్వరలింగం, అరుణ, శ్రీలతలను సన్మానించారు. ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లకు కార్నియాలను తరలించే ఐస్ బాక్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు, ఎన్‌పీసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కళావతి, ప్రభుత్వ ఆస్పత్రి సిద్దిపేట సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.



## రేవంత్ రెడ్డిపై పిటిషన్ రద్దు

న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై తెలంగాణ బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అంతేకాకుండా, రాజకీయ పోరాటాలకు న్యాయస్థానాలను వేదికగా మార్చవద్దని బీజేపీకి గట్టిగా హితవు పలికింది. కేసును కొట్టివేసిన తర్వాత కూడా వాదనలు కొనసాగించే ప్రయత్నం చేసిన బీజేపీ తరఫు న్యాయవాదిపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రూ.10 లక్షల జరిమానా విధిస్తామని గట్టిగా హెచ్చరించారు. గతేడాది జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో జరిగిన సభలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి దారితీశాయి. బీజేపీ అధికారంలోకి వస్తే దేశంలో రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ఆయన చేసిన ప్రసంగం తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసిందని ఆరోపిస్తూ బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు హైదరాబాద్ ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు, ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్-125 కింద కేసు విచారణ కొనసాగించవచ్చని సూచించింది. అయితే, ట్రయల్ కోర్టు ఆదేశాలను రేవంత్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు. రాజకీయ నాయకుల ప్రసంగాల్లో అతిశయోక్తులు సహజమని, వాటిని పరువు నష్టంగా పరిగణించలేమని స్పష్టం చేస్తూ హైకోర్టు ఆ కేసును కొట్టివేసింది.

## 2 కోట్ల విలువైన రద్దైన నోట్లు పట్టివేత

నారాయణగూడ/హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): హైదరాబాద్‌లో భారీగా రద్దయిన పెద్ద నోట్లు పట్టుబడ్డాయి. తొమ్మిదేళ్ల క్రితం రద్దయిన రూ.500, రూ.1000 నోట్లను ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నారాయణగూడ శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంకు వద్ద ఇద్దరిని, వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఇద్దరిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మూడు బ్యాగుల్లో తనిఖీలు చేయగా రూ.2 కోట్ల విలువ చేసే రద్దయిన నోట్లు కనిపించాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# డ్రగ్స్ బయటపడితే రేవంత్ ఏంచేస్తున్నట్లు?

ముడుపులు తీసుకున్నావా.. కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డికి సిగ్గుందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి 12 వేల కోట్ల రూపాయల డ్రగ్స్ ను పట్టుకుంటే తెలంగాణ పోలీసులు, ఇంటెలిజెన్స్, ఈగిల్, హైడ్రాలు ఏం చేస్తున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 12 వేల కోట్ల డ్రగ్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముడుపులు ముట్టాయా అని నిలదీశారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి, ఇక్కడి కంపెనీలో కార్మికులుగా చేరి, నెలల తరబడి పనిచేసి అక్కడ డ్రగ్స్ తయారు చేస్తున్నారని నిర్ధారించారని కేటీఆర్ తెలిపారు. ఆ తర్వాత నీకు, పోలీసులకు సమాచారం లేకుండా 12 వేల కోట్ల రూపాయల డ్రగ్స్ పట్టుకున్నారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా తెలంగాణ పోలీసులు, ఇంటెలిజెన్స్, ఈగిల్, హైడ్రాలు ఏం చేస్తున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. 21 నెలల నుంచి ఆ డ్రగ్స్ కంపెనీపై ఎటువంటి చర్యలు తీసుకోలేదంటే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమైనా ముడుపులు ముట్టాయా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి హోంమంత్రి శాఖ, ఈగల్ టీం, హైడ్రా టీం ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. మీరంతా ముడుపులు తీసుకోవడంలో బిజీగా ఉన్నారా అని మండిపడ్డారు. ఇంతమొత్తంలో డ్రగ్స్ దొరకడం భారతదేశంలోనే ఇది రెండో ఘటన అని కేటీఆర్ తెలిపారు. గతంలో గుజరాత్‌లో 21వేల డ్రగ్స్ దొరికాయని కేటీఆర్ గుర్తుచేశారు. దాని తర్వాత ఇప్పుడు హైదరాబాద్ చర్లపల్లిలో 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ దొరికాయని తెలిపారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇంత డ్రగ్స్ పట్టుకున్నప్పటికీ తెలంగాణ పోలీసులకు సమాచారం లేకపోవడం సిగ్గుపడాల్సిన విషయమని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి ముడుపులు అందాయేమో, అందుకే చూసి చూడనట్లు ఉన్నారని అనుమానం వ్యక్తం చేశారు. లేదంటే ఎవరు పోస్టులు పెడుతున్నారు.. ఎవరు రీట్వీట్‌లు పెడుతున్నారో చూడటం, గణేశుల దగ్గర కేసీఆర్ పాటలు పెట్టిన డీజే బాక్సులు తీసుకుపోవడంలో బిజీగా ఉన్నారేమో అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు స్వయంగా పీసీసీ ప్రెసిడెంట్ ఓ టీవీ చర్చలో ఒప్పుకున్నాడని అన్నారు. కడియం శ్రీహరి కూడా తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు ఒప్పుకున్నారని తెలిపారు. నేరాంగీకారం జరిగిన తర్వాత ఇంకా విచారణ ఎందుకు అని ప్రశ్నించారు. వారిపై వేటు వేయాల్సిందే అని చెప్పారు.




# రాహుల్‌ను ప్రధానిని చేద్దాం: భట్టి

గాంధీభవన్/హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం దేశానికి ఎంతో అవసరమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు శ్రమించిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వ పదవిలో ఏదో ఒక అవకాశం తప్పకుండా లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా నిలిపేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేపట్టిన ప్రతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రివర్గం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆయన స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ విషయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి న్యాయం చేకూరుస్తామని ఆయన అన్నారు. 42 శాతం రిజర్వేషన్ బిల్లును బీజేపీ రాష్ట్రపతి వద్ద నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర దాగి ఉందని ఆయన వ్యాఖ్యానించారు.




## సాగర్‌కు కొనసాగుతున్న వరద.. 14 గేట్లు ఎత్తివేత

నాగార్జునసాగర్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. జలాశయం ఇప్పటికే పూర్తిస్థాయిలో నిండి ఉండటంతో అధికారులు 14 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 1,66,586క్యూసెక్కుల వరద వస్తుండగా అంతే మొత్తంలో వదులుతున్నారు. స్పిల్‌వేద్వారా 1,12,518 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిగిలిన మొత్తాన్ని కుడి, ఎడమ కాలువలు, విద్యుత్ ఉత్పత్తి కోసం విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 589.40 అడుగులకు చేరింది. సాగర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలకుగాను ఇప్పుడు 310.2522 టీఎంసీలు ఉన్నాయి. ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.





## కవితపై చర్యలు తీసుకున్నాం.. ఇక అంతే

**కవిత సస్పెన్షన్‌పై తొలిసారి పెదవి విప్పిన కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, తన సోదరి కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో కవిత సస్పెన్షన్ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. కవిత సస్పెన్షన్‌పై ఆయన మొదటిసారిగా స్పందించారు. "కవితపై మా పార్టీ చర్చించి చర్యలు తీసుకుంది. చర్యలు తీసుకున్న తర్వాత ఇక నేను మాట్లాడటానికి ఏమీ లేదు" అని ఆయన స్పష్టం చేశారు. కవితపై వేటు అనేది పార్టీ అంతర్గతంగా చర్చించి తీసుకున్న నిర్ణయమని, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత వ్యక్తిగతంగా తాను దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని ఆయన తేల్చి చెప్పారు. పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకున్నాక, దాని గురించి మాట్లాడి, విషయాన్ని పొడిగించదలుచుకోలేదని అన్నారు.

## ఎరువుల కొరత వాస్తవమే: పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): రాష్ట్రంలో ఎరువుల కొరత వాస్తవమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అంగీకరించారు. రైతులకు సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఏమీ లేదని చెప్పారు. ఎరువుల కొరత వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఎరువుల విషయంలో తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపుతున్నదని ఆరోపించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎరువుల తయారీ, సరఫరాపై పూర్తి ఆధిపత్యం కేంద్రానిదేనని చెప్పారు. కేంద్రం మన రాష్ట్రంపై వివక్ష చూపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంపై రైతుల్లో వ్యతిరేకత రావాలనేది వారి ఉద్దేశమన్నారు. ఈ సమస్యకు బాధ్యత వహించాల్సిన వాళ్లు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులకు సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఏమీ లేదన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉద్దేశపూర్వకంగా 4 నెలలుగా ఉత్పత్తి జరగట్లేదని ఆరోపించారు. ఆర్ఎఫ్‌సీలో ఉత్పత్తి చేసి ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 11 లక్షల టన్నులకుగాను 5.2 లక్షల టన్నుల ఎరువులే వచ్చాయని వెల్లడించారు. ఎరువుల వైఫల్యం బాధ్యత బీజేపీ తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష ఉంటే రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై తీర్చుకోవాలన్నారు. రైతుల సహకారంతో బీజేపీకి వ్యతిరేకంగా ఒత్తిడి తెస్తామని చెప్పారు.

## 70కి పైగా బీసీ కుల సంఘాల నేతలతో కవిత భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, ఇందుకోసం ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కుల సంఘాల నాయకులతో ఈరోజు ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పటివరకు పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె దుయ్యబట్టారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని బీసీ సంఘాలను కలుపుకొని, రిజర్వేషన్ల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరే వరకు తమ పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు ప్రధానంగా చర్చించారు.

## బీజేపీ రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఎనిమిది మంది రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉంటారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గౌతంరావు, తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్‌లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, బండారి శాంతి కుమార్, కొల్లి మాధవి, జయశ్రీ, బండా కార్తీక్ రెడ్డి, రఘునాథ్ రావు, కల్యాణ్ నాయక్‌లను నియమించినట్లు ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, వివిధ మోర్చాలకు రాష్ట్ర అధ్యక్షులను కూడా నియమించారు.

## ఆదిలాబాద్ సిమెంటు ప్లాంటును పునరుద్ధరించాలి: దుద్దిళ్ల

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఖాయిలా పడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆదిలాబాద్ ప్లాంటును పునరుద్ధరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిసిఐ సీఎండీ సంజయ్ బంగా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో పునరుద్ధరణ ప్రతిపాదనలపై శ్రీధర్ బాబు చర్చించారు. ప్లాంటును ఆధునిక యంత్రాలతో పునరుద్ధరించడానికి రూ.2 వేల కోట్లు అవసరమవుతాయని సిఎండి చెబుతున్నారని, అది జరిగితే మూడు వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కేంద్రం ప్రతిపాదిస్తున్నట్టుగా ప్లాంటు ప్రైవేటీకరణను (డిస్ ఇన్వెస్ట్ మెంటును) తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పునరుద్ధరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సిసిఐ కోరుతోందని, త్వరలోనే దీనిపైన తమ అభిప్రాయాలను అందచేస్తామని వెల్లడించారు. రెండు వేల ఎకరాల్లో నాణ్యతతో కూడిన సున్నపురాయి గనులు ఉన్నందున ప్లాంటు నిర్వహణ అసాధ్యమేమీ కాదని శ్రీధర్ బాబు చెప్పారు. సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్, గనుల శాఖ డైరెక్టర్ వల్లూరు క్రాంతి, టిజిఐఐజి ఎండీ శశాంక తాండూరు సిసిఐ ప్లాంట్ జిఎం శరద్ కుమార్, సిసిఐ రీజినల్

## సోషల్ వాణి



మొత్తం యూరోప్ మార్కెట్‌ను భారత్ ప్రొడక్ట్స్ ముంచెత్తబోతున్నాయి. ముందు చూపుతో మోడీ చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు భారత్‌కు వరం అయ్యాయి.

\- ఉత్తిష్ఠ భారత




## దత్తాద్రికి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలో సబ్ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న దత్తాద్రికి పదోన్నతి లభించింది. సోమవారం ఆయన జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన దత్తాద్రి గారిని ఎస్పీ అభినందించి, పదోన్నతి చిహ్నంగా మరొక స్టార్‌ను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ ఎన్నో ఏళ్ళుగా ప్రజా సంరక్షణ కోసం అవిశ్రాంతంగా చేస్తున్న కృషికి పదోన్నతి ఒక గొప్ప గుర్తింపు అన్నారు. పదోన్నతి అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక మైలురాయి వంటిదని, ముఖ్యంగా పోలీస్ శాఖలో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించవలసి ఉంటుందని అన్నారు. లభించిన పదోన్నతి ద్వారా ప్రజలకు మరింత సమర్థంగా సేవలందించే విధంగా ముందుకు సాగాలని సూచించారు.



## అగ్రహారం జేఎన్టీయూ విద్యార్థుల రాస్తారోకో

వేములవాడ, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం జేఎన్టీయూ విద్యార్థులు బైఠాయించి రాస్తారోకా నిర్వహించారు. కాలేజీ ప్రారంభమై నాలుగేళ్ళు గడిచినా ఇప్పటివరకు సొంత క్యాంపస్ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా ఇచ్చిన భవనానికి కూడా తాళం వేసినందువల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. క్యాంపస్‌లో సరైన సదుపాయాలు, ముఖ్యంగా ల్యాబ్‌లు లేకపోవడంతో ప్రాక్టికల్స్ కోసం కొండగట్టు జేఎన్టీయూకు వెళ్లాల్సి వస్తుందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఎనిమిది గదుల్లోనే తరగతులు నడుస్తుండటంతో పాఠశాల వాతావరణం పూర్తిగా దెబ్బతిన్నదని వారు తెలిపారు. అదనంగా, హాస్టల్ నుండి కాలేజీకి ప్రతిరోజూ రెండు కిలోమీటర్లు నడుస్తూ రావాల్సి రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. తక్షణమే శాశ్వత క్యాంపస్‌తోపాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.




## కలెక్టరేట్ వద్ద రెండవ ఏఎన్ఎంల ఆందోళన

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఎన్ఎంలు ఆందోళన చేపట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిన నిరసనలో భాగంగా సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళన జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఏఎన్ఎంలు పాల్గొని నినాదాలతో కలెక్టరేట్ ఆవరణలో ధర్నా నిర్వహించారు.



## కాంగ్రెస్‌లో చేరండి

**మీనాక్షి నటరాజన్ ఆపరేషన్ ఆకర్ష్**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇతర పార్టీల నేతల్ని చేర్చుకునేందుకు పార్టీ తలుపులు తెరిచే ఉన్నాయంటూ పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో మీనాక్షి నటరాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు పార్టీలోకి వచ్చినా స్వాగతిస్తామన్న ఆమె.. త్వరలోనే నామినేటెడ్,కార్పొరేషన్ పోస్టులు భర్తీ చేస్తామని సూచించారు. అయితే ఇప్పుడు మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. ఆమె పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో చేసిన ప్రకటనల ఆధారంగా, ఇది కేవలం నేతలను చేర్చుకోవడమే కాకుండా, పార్టీలో అంతర్గత సమీకరణలను సమతుల్యం చేయడానికి కూడా ఒక వ్యూహంగా కనిపిస్తోంది. ఇందుకోసం పార్టీలోని నేతలను మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారు,ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి వచ్చినవారు, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరినవారు ఇలా మూడు వర్గాలుగా విభజించారు. వాటి ఆధారంగా పదేళ్లుగా పార్టీలో ఉన్నవారికి ప్రాధాన్యత, కేటగిరీల వారీగా నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుంది. అంటే పార్టీలో ఉన్న కాలం, నిబద్ధత ఆధారంగా అవకాశాలు కల్పించనున్నారు.



## 3 లక్షల గణేశ్ విగ్రహాల నిమజ్జనం

**అధికారులు, సిబ్బందికి మేయర్, కమిషనర్ అభినందన**

**పారిశుద్ధ్య కార్మికుల సేవలకు ప్రత్యేక ప్రశంస**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు గ్రేటర్ వ్యాప్తంగా 3 లక్షల 3 వేల గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారన్నారు. పకడ్బందీ ప్రణాళిక, పటిష్టమైన ఏర్పాట్లతో కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పోలీస్, విద్యుత్, హెచ్ఎండీఏ, హైడ్రా, రెవెన్యూ, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ అభినందనలు తెలిపారు. పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యంతోపాటు టాయిలెట్లు, సరిపడా క్రేన్ల ఏర్పాటు తదితర అంశాల్లో జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి. నిమజ్జనం మార్గం పొడవునా ఏర్పాటు చేసిన గణేశ్ యాక్షన్ టీమ్స్ రోడ్లపై చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలతో ఫలితం కనిపించింది. రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌లో నగరంలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టడం, ప్రధానంగా నగరంలో ఖైరతాబాద్ మహా గణపతి, బాలాపూర్ గణేష్‌లతో సహా నిమజ్జన శోభాయాత్ర జరిగే 303 కిలోమీటర్ల మేర మార్గం మరమ్మతులు చేపట్టడంతో ఊరేగింపు సాఫీగా, సురక్షితంగా, వేగంగా జరిగిందని పేర్కొన్నాన్నారు. పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తూ 15 వేల మంది సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించడంతో పారిశుధ్య నిర్వహణలో ఇబ్బందులు కనిపించలేదన్నారు. 72 కృత్రిమ కొలనులతో ప్రధాన చెరువులపై ఒత్తిడి లేకుండా, ట్రాఫిక్ జామ్‌లు లేకుండా, భక్తులు స్థానికంగానే నిమజ్జనం అయ్యేలా చూడగలిగామన్నారు. జీహెచ్ఎంసీ కల్పించిన ఉచిత భోజన సౌకర్యం భక్తులు, ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను మేయర్, కమిషనర్ ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రశంసించారు.. వారి నిరంతర సేవల వల్లే ఇప్పటి వరకూ 20 వేల అధిక టన్నుల వ్యర్థాలను సేకరించినట్లు తెలిపారు. ఈ వ్యర్థాలను జవ జవహర్ నగర్ లోని ప్రాసెసింగ్ సెంటర్‌కు పంపామన్నారు.

## రైతులను రెచ్చగొడుతున్నారు!

**రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చూస్తాం**

**అవసరమైతే అదనపు కేంద్రాలు: తుమ్మల**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): కొన్ని రాజకీయ పార్టీలు రైతులను రెచ్చగొట్టి, ఎరువుల దుకాణాల వద్ద ధర్నాలు చేసేలా ప్రోత్సహిస్తున్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. ఇకపై యూరియా కొరత లేకుండా చూస్తామని తెలిపారు. యూరియా పంపిణీ కోసం రైతులకు ముందుగానే టోకెన్లు జారీ చేయడం ద్వారా క్యూలు లేకుండా, తోపులాటలు జరగకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా పంపిణీ సజావుగా జరుగుతున్నదని తెలిపారు. రైతు వేదికల వద్ద యూరియా పంపిణీ మొదటి రోజు ఎలాంటి ఆందోళనలు లేకుండా సజావుగా జరిగిందని, అదే పద్ధతిలో యూరియా పంపిణీ చేయాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

# అక్రమ ఎరువులపై పీడీ యాక్ట్



ఏలూరు, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఏపీలో ఎరువులను అక్రమంగా నిల్వ చేస్తూ, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాంటి అక్రమార్కులపై సాధారణ 6ఏ కేసులు కాకుండా, నేరుగా పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లాలో ఎరువుల సరఫరా, పంపిణీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో యూరియా కొరత ఉందంటూ వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కొన్ని మీడియా కథనాలు, రాజకీయ ప్రత్యర్థుల దుష్ప్రచారం కారణంగా రైతులు ఆందోళనకు గురై అవసరానికి మించి ఎరువులను కొనుగోలు చేస్తున్నారని, దీనివల్లే అక్కడక్కడా తాత్కాలిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ సీజన్‌లో జిల్లాకు 33,762 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటికే 32,757 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని, మరో రెండు రోజుల్లో అదనంగా 2,200 టన్నులు అందుబాటులోకి వస్తాయని గణాంకాలతో సహా తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అధికంగానే ఎరువులను అందించామని గుర్తుచేశారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని వైఎస్ఆర్‌సీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టిస్తూ, యూరియా కొరతపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. రైతు సంక్షేమంపై వైఎస్ఆర్‌సీపీకి చిత్తశుద్ధి ఉంటే, వారి హయాంలో కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.1674 కోట్ల బకాయిలను ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆ బకాయిలన్నీ చెల్లించి రైతులను ఆదుకుందని తెలిపారు. ఎరువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 29 చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత పటిష్టం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే 12 కేసులు నమోదు చేశామని, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను బలోపేతం చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, జిల్లావ్యాప్తంగా 530 పంపిణీ కేంద్రాల ద్వారా పారదర్శకంగా ఎరువులు అందిస్తున్నామని భరోసా ఇచ్చారు. మండల స్థాయిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, సమస్యల పరిష్కారం కోసం అధికారుల ఫోన్ నంబర్లను రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదని, కొందరు కావాలనే కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాగా, ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.



## స్మార్ట్ వైజాగ్‌కు 498 కోట్ల రుణం

వైజాగ్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): విశాఖపట్నం అభివృద్ధి ప్రస్థానంలో ఒక చారిత్రాత్మక ముందడుగు పడింది. నగర మౌలిక వసతుల కల్పన కోసం విశాఖ మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ) తన సొంత ఆర్థిక పటిష్టతతో ఏకంగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి భారీ రుణం సాధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సోమవారం నాడు జీవీఎంసీ, ఐఎఫ్‌సీ ప్రతినిధులు ఈ కీలక రుణ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా నగర పాలక సంస్థలు ఆర్థికంగా స్వయంప్రతిపత్తి సాధించే దిశగా జీవీఎంసీ దేశానికే ఒక కొత్త మార్గాన్ని చూపింది. విశాఖలోని మధురవాడ జోన్-2లో అత్యాధునిక మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఈ రుణం ఉపయోగించనున్నారు. మొత్తం రూ.553 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఐఎఫ్‌సీ రూ.498 కోట్లను రుణంగా అందిస్తోంది. మిగిలిన మొత్తంలో రూ.45.64 కోట్లను అమృత్ 2.0 పథకం కింద, మరో రూ.9.36 కోట్లను జీవీఎంసీ తన సొంత నిధుల నుంచి భరించనుంది. విశేషమేమిటంటే, ఈ రుణాన్ని జీవీఎంసీ తన సొంత ఆదాయ వనరుల నుంచే 15 ఏళ్లలో తిరిగి చెల్లించనుంది. దీనికి 8.15 శాతం ఫ్లోటింగ్ వడ్డీ రేటు వర్తిస్తుంది. రాబోయే 30 ఏళ్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా 100 శాతం భూగర్భ డ్రైనేజీ నెట్‌వర్క్, ఆధునిక పంపింగ్, లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగం, రీసైక్లింగ్ చేస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆ ప్రాంతంలో అంటువ్యాధులు తగ్గడంతో పాటు, భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయి. పర్యావరణ పరిరక్షణకు, వరద నీటి నిర్వహణకు ఇది ఎంతగానో దోహదపడుతుంది. ఈ కీలక ఒప్పందం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రంలోని రైతాంగ సమస్యలు, ఇతర పాలనాపరమైన అంశాలపై ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులను కఠినంగా ఆదేశించారు.



## రాజకీయాల్లోకి షర్మిల కొడుకు

**నా కొడుకు రాజకీయాల్లోకి వస్తాడు,, వైఎస్ షర్మిల సంచలన ప్రకటన**

**ఇద్దరూ కలిసి కర్నూలు ఉల్లి మార్కెట్‌లో పర్యటన**

కర్నూలు, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): వైఎస్ కుటుంబం నుంచి మూడో తరం రాజకీయ ప్రవేశంపై గత కొంతకాలంగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి కచ్చితంగా రాజకీయాల్లోకి వస్తాడని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన ప్రకటన చేశారు. సరైన సమయం వచ్చినప్పుడు రాజారెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో అడుగుపెడతాడని ఆమె ప్రకటించారు. ఈ ప్రకటనతో ఏపీ రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. సోమవారం తన తల్లి షర్మిలతో కలిసి రాజారెడ్డి కర్నూలు పర్యటనకు వెళ్లారు. పర్యటనకు ముందు హైదరాబాద్‌లోని నివాసంలో అమ్మమ్మ విజయమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కర్నూలు చేరుకుని, ఉల్లి మార్కెట్‌లో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగానే విలేకరులతో మాట్లాడుతూ షర్మిల తన కుమారుడి రాజకీయ అరంగేట్రంపై అధికారిక ప్రకటన చేశారు. ఇటీవల దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా పులివెందులలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద జరిగిన నివాళి కార్యక్రమంలో రాజారెడ్డి తన తల్లి షర్మిల పక్కనే కూర్చోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. అప్పటి నుంచి ఆయన రాజకీయ ప్రవేశంపై జోరుగా ప్రచారం సాగుతోంది. తాజాగా కర్నూలు పర్యటనలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనడం, షర్మిల దీనిపై స్పష్టత ఇవ్వడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్లయింది. వైఎస్ రాజారెడ్డి అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. గతేడాది చట్నీస్ వ్యవస్థాపకుడు ప్రసాద్ అట్లూరి మనవరాలు ప్రియా అట్లూరిని ఆయన వివాహం చేసుకున్నారు.

## మూగ బాలికనూ రక్షించలేకపోయిందీ సర్కారు: రోజా

వైజాగ్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): విశాఖపట్నంలో మతిస్థిమితం లేని 13 ఏళ్ల మూగ బాలికపై ఇద్దరు బాలురు అత్యాచారం చేయడం తీవ్ర కలకలం రేపింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై వైసీపీ మహిళా నేత రోజా తీవ్రంగా స్పందించారు. "ఒక మూగ బాలికను కూడా రక్షించలేని ఈ ప్రభుత్వం ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే. ఇది మంచి ప్రభుత్వమా? రాక్షస ప్రభుత్వమా చంద్రబాబు గారూ? విశాఖపట్నం సీతమ్మధారలో మూగ బాలికపై ఇద్దరు అత్యాచారానికి పాల్పడడం మీ అసమర్థ పాలనకు నిదర్శం కాదా?" అంటూ రోజా తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.

## టీటీడీ ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్

**జీఏడీ ముఖ్య కార్యదర్శిగా ప్రస్తుత ఈవో శ్యామలరావు**


**ఏపీలో మొత్తం 11 మంది ఐఏఎస్‌ల బదిలీ**

అమరావతి, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన యంత్రాంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా సీనియర్ అధికారి అనిల్ కుమార్ సింఘాల్‌ను నియమించారు. ప్రస్తుతం టీటీడీ ఈవోగా పనిచేస్తున్న శ్యామలరావును సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబును నియమించారు. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ముఖేశ్ కుమార్ మీనా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్, అటవీ పర్యావరణ శాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండే బాధ్యతలు చేపట్టనున్నారు. ఇతర ముఖ్య నియామకాల్లో భాగంగా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనంతరామ్‌ను, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సౌరభ్ గౌర్‌ను ప్రభుత్వం నియమించింది. ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్, పరిశ్రమలు, కార్మిక శాఖ కమిషనర్‌గా శేషగిరిబాబును నియమించారు. ఎండోమెంట్ రెవెన్యూ కార్యదర్శిగా హరి జవహర్‌లాల్‌కు బాధ్యతలు అప్పగించారు. గత కొద్ది రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఏఎస్ అధికారుల పనితీరుపై సమీక్షలు జరిపారు. పరిపాలనలో వేగం పెంచేందుకు, అధికారుల పనితీరును మెరుగుపరిచేందుకు ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. పనితీరును ప్రామాణికంగా తీసుకుని, సమర్థులైన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించాలనే లక్ష్యంతో ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.




# క్యాన్సర్‌కు రష్యా టీకా

ప్రాణాంతక క్యాన్సర్ మహమ్మారి చికిత్సలో సరికొత్త ఆశలు రేకెత్తిస్తూ రష్యా శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు ఒక సరికొత్త వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశామని, అది ప్రస్తుతం వాడుకకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. రష్యాకు చెందిన ఫెడరల్ మెడికల్ అండ్ బయోలాజికల్ ఏజెన్సీ (ఎఫ్ఎంబీఏ) ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. 'ఎంటర్‌మిక్స్' అని పేరు పెట్టిన ఈ వ్యాక్సిన్‌పై ఏళ్ల తరబడి పరిశోధనలు నిర్వహించినట్టు ఎఫ్ఎంబీఏ అధిపతి వెరోనికా స్వోర్ట్సోవా తెలిపారు. మూడేళ్ల పాటు జరిపిన ప్రీ-క్లినికల్ ప్రయోగాల్లో ఈ టీకా అద్భుతమైన ఫలితాలను ఇచ్చినట్టు ఆమె వివరించారు. ఈ వ్యాక్సిన్ అత్యంత సురక్షితమని, ఎంతో సమర్థవంతంగా పనిచేసిందని చెప్పారు. కొన్ని రకాల క్యాన్సర్లలో కణితుల పెరుగుదలను 60 శాతం నుంచి 80 శాతం వరకు తగ్గించిందని,



ప్రయోగాలకు గురైన జీవుల మనుగడ రేటు కూడా గణనీయంగా మెరుగుపడిందని ఆమె పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో కొన్ని వ్యాక్సిన్లలో ఉపయోగించిన ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీనే ఈ క్యాన్సర్ టీకాలోనూ వినియోగించడం గమనార్హం.




## తేజస్వి యాదవ్ భార్య జెర్సీ ఆవు

**ఆర్జేడీ మాజీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు**

పాట్నా: బీహార్‌లో ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) మాజీ ఎమ్మెల్యే రాజ్ బల్లభ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ భార్య రాజశ్రీని ఉద్దేశించి ఆయన చేసిన 'జెర్సీ ఆవు' వ్యాఖ్య రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. నార్దిగంజ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాజ్ బల్లభ్ మాట్లాడుతూ తేజస్వి యాదవ్‌పై విమర్శలు గుప్పించారు. "తేజస్వి యాదవ్ మన కులం అమ్మాయిని పెళ్లి చేసుకుని ఉంటే బాగుండేది. సమాజంలోని ఓ బిడ్డకు మేలు జరిగేది. కానీ ఆయన హర్యానా-పంజాబ్ నుంచి ఎవరో ఒకరిని తీసుకొచ్చారు, అదో జెర్సీ ఆవులా ఉంది" అని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఆర్జేడీ మహిళా విభాగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నవాడాలో జిల్లా ఆర్జేడీ మహిళా విభాగం అధ్యక్షురాలు రేణు సింగ్ నేతృత్వంలో నిరసన చేపట్టారు. సద్భావనా చౌక్ వద్ద రాజ్ బల్లభ్ యాదవ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రేణు సింగ్ మాట్లాడుతూ.. "తేజస్వి భార్య రాజశ్రీని జెర్సీ ఆవు అని పిలవడం ద్వారా రాజ్ బల్లభ్ యాదవ్ కేవలం ఆమెను మాత్రమే కాదు, యావత్ మహిళా లోకాన్నే అవమానించారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని హెచ్చరించారు. "మహిళల పట్ల అవమానాలను భారతదేశం సహించదు" అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. గతంలో ఆర్జేడీలో ఉన్న రాజ్ బల్లభ్ యాదవ్‌కు వివాదాస్పద చరిత్ర ఉంది. 2016లో బాలికపై అత్యాచారం కేసులో ఆయన జైలుకు వెళ్లారు. దీంతో ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించారు. అయితే, ఇటీవలే పట్నా హైకోర్టు ఈ కేసులో ఆయన్ను నిర్దోషిగా ప్రకటించింది.

## మెహుల్ చోక్సీకి ప్రత్యేక వసతులు

**12 గంటల వైద్య సంరక్షణ.. కేంద్రం హామీ**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని భారత్‌కు రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. విచారణ నిమిత్తం ఆయనను అప్పగించాలని కోరుతూ దాఖలు చేసిన అభ్యర్థనలో కీలకమైన హామీలను పొందుపరిచింది. భారత్‌లోని జైలులో చోక్సీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని బెల్జియంకు భరోసా ఇచ్చింది. రూ. 12,000 కోట్ల పీఎన్‌బీ మోసం కేసులో విచారణ ఎదుర్కొనేందుకు చోక్సీని భారత్‌కు అప్పగించే ప్రక్రియలో భాగంగా, ఆయనకు జైలులో కల్పించబోయే సౌకర్యాలపై భారత ప్రభుత్వం స్పష్టమైన హామీలు ఇచ్చింది. చోక్సీకి సరిపడా నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు, 24 గంటల పాటు నిరంతర వైద్య సంరక్షణ అందుబాటులో ఉంటుందని తన అభ్యర్థనలో పేర్కొంది. అంతేకాకుండా, ఆయన ఉండే గది, పరిసరాలు అత్యంత పరిశుభ్రంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. విదేశాల్లో తలదాచుకుంటున్న ఆర్థిక నేరగాళ్లు, అక్కడి కోర్టులలో తమను అప్పగించవద్దని కోరేటప్పుడు తరచుగా భారత జైళ్లలోని దుర్భర పరిస్థితులను కారణంగా చూపుతుంటారు.

# భారతే లక్ష్యం!

**రష్యాపై ట్రంప్ రెండో దశ ఆంక్షలు.. ఉక్రెయిన్‌పై భారీ వైమానిక దాడి ఎఫెక్ట్**

వాషింగ్టన్: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్ వంటి దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరికలు పంపారు. రష్యాపై రెండో దశ ఆంక్షలు విధించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ చర్యలు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలను కూడా లక్ష్యంగా చేసుకుంటాయని ఆయన పరోక్షంగా సూచించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని ప్రభుత్వ భవనంపై రష్యా భారీ వైమానిక దాడి జరిపిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యాపై లేదా రష్యా నుంచి ఆయిల్ కొనే దేశాలపై కొత్త ఆంక్షలకు మీరు సిద్ధంగా ఉన్నారా? అని వైట్‌హౌస్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నకు ట్రంప్.. "అవును, నేను సిద్ధంగా ఉన్నాను" అని ఒక్క మాటలో సమాధానమిచ్చారు. అయితే, ఆ ఆంక్షల స్వరూపంపై ఆయన ఎలాంటి వివరాలూ వెల్లడించలేదు. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగుతుండటం, శాంతి ప్రయత్నాలు విఫలం కావడంతో అమెరికా ప్రభుత్వంలో అసహనం పెరుగుతోందని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అంశంపై అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ మరింత స్పష్టతనిచ్చారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అమెరికా, యూరోపియన్ యూనియన్ కలిసి 'సెకండరీ టారిఫ్‌లు' విధించే అవకాశం ఉందని ఓ టీవీ ఛానెల్‌కు తెలిపారు. రష్యా ఆర్థిక వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చడం



ద్వారానే అధ్యక్షుడు పుతిన్‌ను చర్చల టేబుల్‌పైకి తీసుకురాగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే గత నెలలో అమెరికా.. భారత్ నుంచి వచ్చే ఎగుమతులపై 25 శాతం పెనాల్టీ టారిఫ్‌ను విధించింది. దీంతో మొత్తం దిగుమతి సుంకం 50 శాతానికి చేరింది. "రష్యా యుద్ధ యంత్రాంగానికి భారత్ ఇంధనం పోస్తోందని" ట్రంప్ పలుమార్లు ఆరోపించారు. అయితే, అమెరికా చర్యలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ దేశ ఇంధన భద్రతా అవసరాల కోసమే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని, అమెరికా ఆంక్షలు అన్యాయమని న్యూఢిల్లీ వాదిస్తోంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ, ట్రంప్ మధ్య ఆన్‌లైన్‌లో జరిగిన సంభాషణతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని భావించినప్పటికీ, తాజా పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మరోవైపు, ఆదివారం జరిగిన దాడిలో రష్యా 810 డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించగా, వాటిలో 747 డ్రోన్లను కూల్చివేశామని ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ దాడిలో నలుగురు పౌరులు మరణించారు. రష్యాపై కఠిన ఆంక్షలు విధించి, యుద్ధాన్ని ఆపేలా పుతిన్‌పై ఒత్తిడి తేవాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికాను కోరారు.

# సొంత దేశంలోనే వీసా ఇంటర్వ్యూ

**అమెరికా వీసాపై కొత్త రూల్**

వాషింగ్టన్: అమెరికా వెళ్లాలనుకునే భారతీయులకు ఇది ముఖ్య గమనిక. నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల జారీ ప్రక్రియలో అమెరికా ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్నవారు తమ సొంత దేశంలో లేదా చట్టబద్ధంగా నివసిస్తున్న దేశంలో మాత్రమే ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇతర దేశాలకు వెళ్లి వేగంగా వీసా ఇంటర్వ్యూ పూర్తి చేసుకునే వెసులుబాటును అమెరికా విదేశాంగ శాఖ రద్దు చేసింది. ఈ కొత్త నిబంధన తక్షణమే అమల్లోకి వచ్చింది. కరోనా మహమ్మారి సమయంలో భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయాల్లో వీసా దరఖాస్తులు భారీగా పేరుకుపోయాయి. దీంతో అపాయింట్‌మెంట్ కోసం దాదాపు మూడేళ్ల వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ జాప్యాన్ని నివారించేందుకు చాలామంది భారతీయులు దుబాయ్, బ్యాంకాక్ వంటి ఇతర దేశాలకు వెళ్లి వేగంగా బీ1 (వ్యాపారం), బీ2 (పర్యాటకం) వీసా ఇంటర్వ్యూలను పూర్తి




చేసుకున్నారు. కరోనా సంక్షోభం దృష్ట్యా అమెరికా ప్రభుత్వం కూడా ఈ వెసులుబాటును కల్పించింది. అయితే, తాజాగా ఆ మినహాయింపును తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మార్పు వల్ల పర్యాటకం, వ్యాపారం, విద్య (ఎఫ్-1), తాత్కాలిక ఉద్యోగ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే వారిపై తీవ్ర ప్రభావం పడనుంది. ముఖ్యంగా అత్యవసరంగా వ్యాపార సమావేశాలు లేదా కుటుంబ కార్యక్రమాల కోసం అమెరికా వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పవు. "ది వీసా కోడ్" వ్యవస్థాపకుడు జ్ఞానమూకన్ సెంతుర్‌జోతి మాట్లాడుతూ.. ఇప్పటికే యూరప్, ఆసియా, మధ్యప్రాచ్య దేశాల్లో వీసా ఇంటర్వ్యూల కోసం దరఖాస్తు చేసుకున్న అనేక మంది ఇప్పుడు కొత్త నిబంధనల ప్రకారం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

# బరువు తగ్గితే కోటి బోనస్

చైనా కంపెనీ 'ఇన్‌స్టా360' వినూత్న ఆఫర్

బీజింగ్: ఉద్యోగులు బరువు తగ్గితే ఏ కంపెనీ అయినా అభినందిస్తుంది. కానీ, చైనాకు చెందిన ఓ టెక్ కంపెనీ మరో అడుగు ముందుకేసి బరువు తగ్గిన వారికి ఏకంగా కోటి రూపాయలకు పైగా బోనస్‌గా ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. ఈ వినూత్న కార్యక్రమం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. షెన్‌జెన్ కేంద్రంగా పనిచేస్తున్న 'అరాషి విజన్ ఇంక్' (ఇన్‌స్టా360) అనే సంస్థ తమ ఉద్యోగుల ఆరోగ్యం కోసం ఈ ప్రోత్సాహక కార్యక్రమాన్ని చేపట్టింది. "మిలియన్ యువాన్ వెయిట్ లాస్ ఛాలెంజ్" పేరుతో ఏటా ఓ పోటీని నిర్వహిస్తోంది. ఈ పోటీలో భాగంగా ఉద్యోగులు బరువు తగ్గితే భారీగా నగదు బహుమతులు అందిస్తోంది. ఆగస్టు 12న ప్రారంభమైన ఈ ఏడాది ఛాలెంజ్‌లో భాగంగా ఉద్యోగులు ప్రతి అర కిలో బరువు తగ్గితే 500 యువాన్లు (సుమారు రూ.6,100) ప్రోత్సాహకంగా ఇస్తోంది. మొత్తం బోనస్ విలువ మిలియన్ యువాన్లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.1.23 కోట్లు. ఈ ఛాలెంజ్‌లో భాగంగా క్సీ యాఖీ అనే ఓ యువ ఉద్యోగిని "వెయిట్ లాస్ ఛాంపియన్"గా నిలిచింది. ఆమె కేవలం 90 రోజుల్లో 20 కిలోలకు పైగా బరువు తగ్గి 20,000 యువాన్లు (సుమారు రూ. 2.47 లక్షలు) నగదు బహుమతి గెలుచుకుంది. క్రమశిక్షణ, నియంత్రిత ఆహారం, రోజుకు గంటన్నర వ్యాయామం వల్లే ఇది సాధ్యమైందని ఆమె తెలిపింది. "ఇది కేవలం అందం కోసం కాదు, ఆరోగ్యం కోసం. నన్ను నేను ఉత్తమంగా తీర్చిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయం" అని ఆమె పేర్కొంది. ఈ ప్రోత్సాహకంలో ఓ మెలిక కూడా ఉంది. బరువు తగ్గిన తర్వాత ఎవరైనా తిరిగి బరువు పెరిగితే, ప్రతి అర కిలోకు 800 యువాన్లు (సుమారు రూ.9,800) జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు ఎవరికీ జరిమానా విధించలేదని కంపెనీ తెలిపింది. 2022 నుంచి ఇప్పటివరకు ఏడుసార్లు ఈ పోటీని నిర్వహించగా దాదాపు 2 మిలియన్ యువాన్లు (రూ.2.47 కోట్లు) బహుమతులుగా పంపిణీ చేశారు. గత ఏడాది 99 మంది ఉద్యోగులు కలిసి 950 కిలోల బరువు తగ్గి, మిలియన్ యువాన్ల బోనస్‌ను పంచుకున్నారు.



## భారత్ క్షమాపణ చెప్పదు

**కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్**

న్యూఢిల్లీ: భారత దేశం ఎవరికీ ఎలాంటి క్షమాపణ చెప్పదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పష్టం చేశారు. అసలు క్షమాపణ కోరేంత తప్పు భారత్ చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుత్నిక్ చేసిన వ్యాఖ్యలపై థరూర్ తాజాగా స్పందించారు. రష్యా నుంచి మన దేశం చమురు దిగుమతి చేసుకుంటుండంపై అమెరికా ఆగ్రహంగా ఉన్న విషయం తెలిసిందే. తాను హెచ్చరించినా చమురు కొనుగోళ్లు ఆపలేదనే కోపంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా టారిఫ్ లు విధించారు. దీంతో ఇరు దేశాల మధ్య దూరం పెరిగింది. ప్రతిగా ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, రష్యా ప్రెసిడెంట్ పుతిన్ లతో భేటీ అయ్యారు. ఈ పరిణామాలపై హొవార్డ్ లుత్నిక్ స్పందిస్తూ.. 'మరో రెండు నెలల్లో భారత్ మా దారికి వస్తుంది, భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాకు సారీ చెబుతారు' అంటూ వ్యాఖ్యానించారు. హొవార్డ్ లుత్నిక్ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తాజాగా తిప్పికొట్టారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయాలంటూ మొదట్లో భారత్ ను ప్రోత్సహించిందే అమెరికా అని గుర్తుచేశారు. అంతర్జాతీయంగా ధరల స్థిరీకరణ కోసం రష్యా చమురు కొనాలని చెప్పిందన్నారు. ఇప్పుడు అదే అమెరికా రష్యా చమురు కొనొద్దని చెబుతోందని చెప్పారు. 'మీరు కొనమంటే కొనాలి, వద్దంటే మానేయాలా?' అని నిలదీశారు. ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే భారత విదేశాంగ విధానం ఉంటుందని థరూర్ స్పష్టం చేశారు. చైనా, తుర్కియే దేశాలు రష్యా నుంచి భారీ మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్నాయని, రష్యా నుంచి పెద్ద మొత్తంలో వివిధ ఉత్పత్తులను యూరప్ దిగుమతి చేసుకుంటోందని థరూర్ వివరించారు. భారత్ తో పోలిస్తే ఈ దేశాల వల్లే రష్యాకు పెద్ద మొత్తంలో డాలర్ నిల్వలు సమకూరుతున్నాయని ఆరోపించారు. వాటిని వదిలేసి భారత్ ను లక్ష్యంగా చేసుకుని టారిఫ్ లు విధించి అమెరికానే తప్పు చేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా లుత్నిక్ ను ఉద్దేశిస్తూ.. 'మీ దేశం విషయంలో మీకెంత సార్వభౌమాధికారం ఉంటుందో, మీ నిర్ణయాల విషయంలో మీరెంత స్వతంత్రంగా ఉంటారో మా దేశం విషయంలో మేం కూడా అంతే సార్వభౌమాధికారంతో, స్వతంత్రతతో వ్యవహరిస్తాం' అనే విషయం అర్థం చేసుకోవాలని శశిథరూర్ హితవు పలికారు.

## లంగ్ క్యాన్సర్‌కు కొత్త ఔషధం

**అభివృద్ధి చేసిన చైనా శాస్త్రవేత్తలు**

బీజింగ్: ప్రమాదకరమైన ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకు ఆశలు రేకెత్తించే ఓ కొత్త అధ్యయనం వెలుగులోకి వచ్చింది. అత్యంత వేగంగా వ్యాపించే స్మాల్-సెల్ లంగ్ క్యాన్సర్ చికిత్స కోసం చైనా పరిశోధకులు అభివృద్ధి చేసిన ఓ కొత్త యాంటీబాడీ ఔషధం తొలి దశ క్లినికల్ ట్రయల్స్‌లోనే అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. ఈ వ్యాధికి పరిమిత చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఈ కొత్త ఆవిష్కరణ వైద్య ప్రపంచంలో సరికొత్త ఆశలను నింపుతోంది. చైనాలోని షాన్‌డాంగ్ ఫస్ట్ మెడికల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ లిన్లిన్ వాంగ్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన నిర్వహించింది. ఎస్హెచ్ఆర్-4849 (ఐడీఈ849) అనే ఈ యాంటీబాడీ-డ్రగ్ కాంజుగేట్‌ను మొత్తం 54 మంది రోగులపై ప్రయోగించారు. క్యాన్సర్ కణాలపై ఉండే డీఎల్ఎల్3 అనే ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ఔషధాన్ని రూపొందించారు. పరిశీలనకు అర్హులైన 42 మంది రోగులలో ఈ ఔషధం దాదాపు 59.5 శాతం మందిలో క్యాన్సర్‌పై సానుకూలంగా స్పందించింది. అంతేకాకుండా, 90.5 శాతం మందిలో వ్యాధిని విజయవంతంగా నియంత్రించినట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం ప్రకారం 2.4 ఎంజీ/కిలో మోతాదు తీసుకున్న రోగులలో స్పందన రేటు ఏకంగా 77.8 శాతంగా నమోదు కావడం గమనార్హం. ఈ ఔషధం వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు కూడా నియంత్రించగలిగే స్థాయిలోనే ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. తెల్ల రక్త కణాల సంఖ్య తగ్గడం, రక్తహీనత, వికారం వంటి సాధారణ సమస్యలు కనిపించినప్పటికీ, వీటి కారణంగా ఎవరూ చికిత్సను మధ్యలో ఆపలేదని లేదా ప్రాణాపాయం కలగలేదని స్పష్టం చేశారు.

## 'గ్రేట్ నికోబార్'తో ప్రమాదంలో ఆదివాసీల ఉనికి

**కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ**

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ప్రాజెక్ట్ ఒక "పెద్ద పర్యావరణ విపత్తు" అని అభివర్ణించిన ఆమె, ఇది ఆదివాసీ తెగల హక్కులను కాలరాయడమే కాకుండా, దేశంలోని అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థను నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రముఖ దినపత్రికలో ఆమె ఒక వ్యాసం రాశారు. షోంపెన్, నికోబారీస్ వంటి ఆదిమ తెగల మనుగడకే ప్రమాదం వాటిల్లినప్పుడు దేశ ప్రజల మనస్సాక్షి మౌనంగా ఉండకూడదని సోనియా గాంధీ తన వ్యాసంలో పేర్కొన్నారు. రూ. 2,72,000 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు వల్ల అక్కడి ఆదివాసీ తెగలు, అరుదైన వృక్ష, జంతుజాలానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆమె అన్నారు. "భవిష్యత్ తరాల కోసం ఈ అద్వితీయమైన పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా మనమందరం గళం విప్పాలి" అని ఆమె పిలుపునిచ్చారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో రాజ్యాంగపరమైన, చట్టపరమైన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సోనియా ఆరోపించారు. షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్‌ను సంప్రదించలేదని, గ్రేట్ నికోబార్ గిరిజన మండలి విజ్ఞప్తులను పెడచెవిన పెట్టారని ఆమె విమర్శించారు. భూసేకరణ చట్టం-2013 కింద నిర్వహించిన సామాజిక ప్రభావ మదింపులో షోంపెన్, నికోబారీస్ తెగలను భాగస్వాములుగా చేర్చకపోవడం దారుణమని అన్నారు. పర్యావరణ నష్టంపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం అధికారిక లెక్కల ప్రకారం 8.5 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని, అయితే స్వతంత్ర అంచనాల ప్రకారం ఈ సంఖ్య 32 లక్షల నుంచి 58 లక్షల వరకు ఉండొచ్చని తెలిపారు. దీనికి పరిహారంగా వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న హర్యానాలో మొక్కలు నాటతామనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పైగా ఆ భూమిలో కొంత భాగాన్ని హర్యానా ప్రభుత్వం మైనింగ్ కోసం వేలం వేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. తాబేళ్లు గుడ్లు పెట్టే సున్నితమైన తీర ప్రాంతంలో పోర్టు నిర్మాణం చేపట్టడంపై సోనియా అభ్యంతరం తెలిపారు. ఈ ప్రాంతం భూకంపాల ముప్పు అధికంగా ఉన్న జోన్‌లో ఉందని, ఇక్కడ ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మించడం వల్ల పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రజలు, పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడతాయని ఆమె హెచ్చరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్, అంతర్జాతీయ విమానాశ్రయం, టౌన్‌షిప్, పవర్ ప్లాంట్ నిర్మించనున్నారు.

లగ్జరి చిత్రం







## తారకరాముడు నా ఫేవరేట్

టాలీవుడ్ అందాల జంటలలో శ్రీకాంత్ – ఊహ తప్పకుండా కనిపిస్తారు. శ్రీకాంత్ హీరోగా ఎదుగుతున్న రోజులవి. శివరంజని పేరుతో తమిళ .. మలయాళ సినిమాలు చేస్తూ వచ్చి, 'ఊహ' పేరుతో ఆమె తెలుగు తెరకి పరిచయమయ్యారు. 'ఆమె' సినిమాతో ఆమె ప్రయాణం ఇక్కడ మొదలైంది. ఈ సినిమాతో మొదలైన పరిచయం .. ప్రేమగా మారడం .. పెళ్లి వరకూ వెళ్లడం జరిగింది. ఆ తరువాత కెమెరాకు దూరంగా ఉంటూ వచ్చిన ఊహ, తాజాగా 'మహా మ్యాక్స్'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక విషయాలను పంచుకున్నారు. "నేను ఇండస్ట్రీకి వచ్చే సమయానికి తెలుగులో వేరే శివరంజని ఉండటం వల్ల, ఈవీవీగారు నా పేరును 'ఊహ'గా మార్చారు. అప్పటికి నాకు తెలుగు సరిగ్గా రాకపోవడం వలన చాలా భయపడ్డాను. అయితే ఆరంభంలోనే 'ఆమె' సినిమాతో ఒక మంచి పాత్ర పడటం నా అదృష్టం అనిపించింది. 'ఆమె' సినిమాలో శ్రీకాంత్ .. నేను చేసిన ఫస్టు సీన్ .. పెళ్లి సీన్. ఆ తరువాత నిజంగానే మేము పెళ్లి చేసుకోవడం చిత్రంగా అనిపిస్తూ ఉంటుంది" అని అన్నారు. "శ్రీకాంత్ చేసిన సినిమాలలో 'తారకరాముడు' నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాలలో అది నా ఫేవరేట్ అని చెప్పొచ్చు. ఆ తరువాత 'ఖడ్గం' అని చెబుతాను. ఆయన సినిమాలలో నచ్చనిది కూడా ఉంది. కాకపోతే అదేమిటనేది చెప్పకూడదు. పెళ్లి తరువాత సినిమాలకి దూరంగా ఉండాలని ముందుగానే నిర్ణయించుకున్నాను. ఇక పిల్లల కెరియర్ విషయానికి వస్తే, తామేం చేయాలనే విషయంలో వాళ్లకి పూర్తి క్లారిటీ ఉంది" అని చెప్పారు.

## వరప్రసాద్ ఓటీటీ రైట్స్‌కు భారీ ధర

మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం విడుదల కాకముందే సంచలనాలు సృష్టిస్తోంది. సినిమా షూటింగ్ దశలో ఉండగానే, దాని ప్రీ-రిలీజ్ బిజినెస్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో భారీ మొత్తానికి కైవసం చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాను షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేశ్ ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు తారస్థాయికి చేరాయి. చిరంజీవి, వెంకటేశ్ కలిసి తెరపై కనిపించనుండటం, దానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనుండటంతో సినిమాకు అన్ని వైపుల నుంచి భారీ ఆఫర్లు వస్తున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఓటీటీ డీల్ మాత్రమే కాకుండా, శాటిలైట్, ఆడియో, థియేట్రికల్ హక్కులకు కూడా పెద్ద ఎత్తున పోటీ నెలకొన్నట్లు సమాచారం.





## రజనీతో పోటీ లేదు: కమల్ హాసన్

దక్షిణ భారత సినీ పరిశ్రమలో కొన్ని దశాబ్దాలుగా అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న కల నిజం కాబోతోంది. ఇద్దరు మహానటులు, దిగ్గజాలు రజనీకాంత్, కమల్ హాసన్ మళ్లీ కలిసి ఒకే తెరపై కనిపించనున్నారు. దాదాపు 46 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటించబోతున్నట్లు స్వయంగా కమల్ హాసన్ అధికారికంగా ప్రకటించారు. దుబాయ్‌లో జరిగిన సైమా అవార్డుల వేడుకలో ఈ సంచలన ప్రకటన చేసి అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ.. "ఇన్నాళ్లూ ప్రజలే మా మధ్య పోటీని సృష్టించారు. కానీ, నా మిత్రుడు రజనీకాంత్‌తో నాకు ఎలాంటి విభేదాలు లేవు. మేమిద్దరం త్వరలోనే చేతులు కలపబోతున్నాం" అని స్పష్టం చేశారు. ఒకరి సినిమాలను మరొకరం నిర్మించుకోవాలని కూడా గతంలో ప్రయత్నించామని ఆయన గుర్తుచేసుకున్నారు. కమల్ మాటల్లోని విశ్వాసం చూస్తుంటే, ఈ భారీ ప్రాజెక్ట్ అతి త్వరలోనే పట్టాలెక్కడం ఖాయమనిపిస్తోంది.



## సిద్ధుతో జర్నీ ప్రత్యేకం

యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా' షూటింగ్ చివరి అంకానికి చేరుకుంది. ఈ సినిమాలో నటిస్తున్న హీరోయిన్ రాశి ఖన్నా తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను తాజాగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సినిమాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్ పంచుకున్నారు. "కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా కొన్ని కథలు గుర్తుండిపోతాయి. 'తెలుసు కదా' అలాంటి కథే. ఈ సినిమా ప్రయాణం నాకు ఎంతో ప్రత్యేకం. ఈ జర్నీలో నాతో ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మేం సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగుపెట్టే రోజు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని రాశి ఖన్నా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయం అవుతుండటం విశేషం. సిద్ధు సరసన రాశి ఖన్నాతో పాటు శ్రీనిధి శెట్టి కూడా మరో కథానాయికగా నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.



## నటి నవ్యకు ఆస్ట్రేలియాలో చేదు అనుభవం

సాధారణంగా మహిళలు మల్లెపూలను ఎంతో ఇష్టంగా తలలో పెట్టుకుంటారు. ఈ ఇష్టమే ప్రముఖ మలయాళ నటి నవ్యా నాయర్‌కు లక్ష రూపాయల జరిమానా తెచ్చిపెట్టింది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆమె తన వెంట తీసుకెళ్లిన కొద్దిపాటి మల్లెపూల కారణంగా అక్కడి విమానాశ్రయ అధికారులు ఏకంగా రూ. 1.14 లక్షల జరిమానా విధించారు. ఈ ఊహించని ఘటనతో నవ్య ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇటీవల విక్టోరియా మలయాళీ అసోసియేషన్ నిర్వహించిన ఓనం వేడుకల్లో పాల్గొనేందుకు నవ్య నాయర్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు వెళ్లారు. విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు ఆమె బ్యాగేజీని తనిఖీ చేయగా అందులో దాదాపు 15 సెంటీమీటర్ల పొడవున్న మల్లెపూల దండను గుర్తించారు. ఆస్ట్రేలియాలో జీవభద్రత (బయోసెక్యూరిటీ) చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. దేశంలోని వ్యవసాయం, పర్యావరణాన్ని కాపాడేందుకు విదేశాల నుంచి తాజా పువ్వులు, మొక్కలు, విత్తనాలు వంటి వాటిని తీసుకురావడంపై పూర్తి నిషేధం ఉంది.



## నిజంగానే డేటింగ్‌లో శ్రీలీల, కార్తీక్ ఆర్యన్

బాలీవుడ్ యువ కథానాయకుడు కార్తీక్ ఆర్యన్, టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ వస్తున్న వార్తలకు మరింత బలం చేకూరింది. కేవలం తెరపైనే కాకుండా, తెర వెనుక కూడా వీరిద్దరి మధ్య ప్రత్యేక అనుబంధం ఉందని జరుగుతున్న ప్రచారానికి తాజాగా జరిగిన ఓ సంఘటన ఆజ్యం పోసింది. ఇటీవల ముంబైలోని కార్తీక్ ఆర్యన్ నివాసంలో జరిగిన గణేశ్ వేడుకలకు శ్రీలీల తన కుటుంబంతో సహా హాజరయ్యారు. ఇరు కుటుంబాలు కలిసి పండుగ జరుపుకోవడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం వీరిద్దరూ అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ ప్రేమకథా చిత్రంలో కలిసి నటిస్తున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుంచి వీరి మధ్య స్నేహం కంటే ఎక్కువే ఉందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఏకంగా కార్తీక్ ఇంటికి శ్రీలీల తన కుటుంబాన్ని తీసుకురావడం ఈ ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది. ఈ వేడుకలో ఇద్దరూ తెలుపు రంగు దుస్తులు ధరించి ఒకరికొకరు జోడీగా కనిపించారు. ఇరు కుటుంబాలు కలిసి దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






# ఆసియా కప్ నేటి నుంచే

గత రెండు నెలలుగా ధనాధన్ బ్యాటింగ్ కోసం వేచి చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెరపడే సమయం ఆసన్నమైంది. ఐపీఎల్ 2025 సీజన్ ముగింపుతో మూగబోయిన బ్యాట్లు.. ఇక సిక్సర్లు, బౌండరీల మోతతో దద్దరిల్లనున్నాయి. అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్న ఆసియా కప్ 2025 టోర్నీకి మంగళవారం తెరలేవనుంది. యూఏఈ వేదికగా టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీ కోసం ఆసియా క్రికెట్ దేశాలు సిద్ధమయ్యాయి. ఆతిథ్య యూఏఈతో పాటు భారత్, పాకిస్థాన్, ఒమన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, హాంగ్ కాంగ్‌లు బరిలోకి దిగుతున్నాయి. భారత కాలమానం ప్రకారం మ్యాచ్‌లన్నీ రాత్రి 8 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ నెల ఆసాంతం జరగనున్న ఈ టోర్నీ అభిమానులకు కావాల్సిన అసలు సిసలు మజా అందివ్వనుంది. అఫ్గానిస్థాన్, హాంగ్ కాంగ్ మధ్య అబుదాబి వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఇరు జట్లు యూఏఈకి చేరుకున్నాయి. అఫ్గానిస్థాన్ ఇక్కడ ట్రై సిరీస్ కూడా ఆడింది. ఫైనల్లో పాకిస్థాన్ చేతిలో ఓడినా.. లీగ్ దశలో ఆ జట్టును ఓడించింది. భారత్ తర్వాత పటిష్టంగా కనిపిస్తోంది. ఆసియాలో భారత్ తర్వాత తామే అత్యంత పటిష్టమైన జట్టుగా నిరూపించుకునేందుకు ఈ టోర్నీని ఉపయోగించుకోవాలని అఫ్గాన్ భావిస్తోంది.

హాంగ్ కాంగ్‌తో పోరులో అఫ్గాన్ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ సునాయస విజయాన్నందుకుంటుంది. మరోవైపు హాంగ్ కాంగ్ మూడో సారి ఆసియా కప్ బరిలోకి దిగుతోంది. కానీ అఫ్గాన్‌కు పోటీనిచ్చే సామర్థ్యం అయితే హాంగ్ కాంగ్‌కు లేదు.

అఫ్గానిస్థాన్ జట్టు: రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, దర్వీష్ రసూలి, సెదిఖుల్లా అటల్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, కరీం జనత్, మహ్మద్ నబీ, గుల్బదిన్ నైబ్, షరాఫుద్దీన్ అష్రఫ్, మహ్మద్ ఇషాక్, ముజీబ్ ఉర్ రెహమాన్, అల్లా ఘజన్‌ఫర్, నూర్ అహ్మద్, ఫరీద్ మాలిక్, నవీన్-ఉల్-హక్, ఫజల్హక్ ఫరూఖీ.

హాంగ్ కాంగ్ జట్టు: యాసిమ్ ముర్తాజా (కెప్టెన్), బాబర్ హయాత్, జీషాన్ అలీ, నియాజకత్ ఖాన్ మహ్మద్, నస్రుల్లా రాణా, మార్టిన్ కోయెట్జీ, అన్షుమాన్ రథ్, కల్హాన్ మార్క్ చల్లు, ఆయుష్ ఆశిష్ శుక్లా, మహ్మద్ ఐజాజ్ ఖాన్, అతీక్ ఉల్ రెహ్మాన్ ఇక్బాల్, కించిత్ షా, ఆదిల్ మెహమూద్, హరూన్ మహ్మద్ అర్షద్, అలీ హసన్, షాహిద్ వాసిఫ్, ఘజాన్‌ఫర్ మహ్మద్, మహ్మద్ వహీద్, అనాస్ ఖాన్.



## యూఎస్ ఓపెన్ విజేతగా అల్కరాజ్

స్పెయిన్ టెన్నిస్ సంచలనం కార్లోస్ అల్కరాజ్ యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో తన చిరకాల ప్రత్యర్థి యానిక్ సిన్నర్‌ను ఓడించి ఆరో గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ హోరాహోరీ పోరులో అల్కరాజ్ 6-2, 3-6, 6-1, 6-4 తేడాతో సిన్నర్‌ను ఓడించాడు. ఈ గెలుపుతో కార్లోస్ అల్కరాజ్ రెండోసారి యూఎస్ ఓపెన్ విజేతగా నిలిచాడు. కార్లోస్ అల్కరాజ్, యానిక్ సిన్నర్ మధ్య ఈ పోరు అభిమానులను ఆద్యంతం అలరించింది. నాలుగు సెట్ల పాటు ఉత్కంఠగా ఈ మ్యాచ్ జరిగింది. ఈ విజయంతో అల్కరాజ్ ప్రపంచ నంబర్ వన్ ర్యాంకింగ్‌ను తిరిగి దక్కించుకున్నాడు. సెప్టెంబర్ 2023 తర్వాత అల్కరాజ్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకోవడం ఇదే మొదటిసారి. ఈ ఓటమితో హార్డ్ కోర్టు గ్రాండ్ స్లామ్‌లలో సిన్నర్ 27 వరుస విజయాల పరంపర కూడా ముగిసింది. అల్కరాజ్ చేతిలో సిన్నర్ ఓడిపోవడం ఇది రెండో గ్రాండ్ స్లామ్ ఫైనల్. గ్రాండ్ స్లామ్ టైటిళ్ల విషయంలో కూడా యానిక్ సిన్నర్(4) కంటే అల్కరాజ్ ముందున్నాడు. ఫైనల్ మ్యాచ్ లో అల్కరాజ్ మొదటి గేమ్‌లోనే సిన్నర్ సర్వీస్‌ను బ్రేక్ చేసి మొదటి సెట్‌ను సులభంగా గెలుచుకున్నాడు. అయితే రెండో సెట్ లో యానిక్ సిన్నర్ పుంజుకొని అల్కరాజ్ సర్వీస్ ను బలహీనపరిచి 3-1 ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత సిన్నర్ రెండో సెట్ గెలిచి మ్యాచ్ ను సమం చేశాడు. అయితే మూడో సెట్‌లో అల్కరాజ్ మళ్లీ ఆధిపత్యం చెలాయించాడు. అల్కరాజ్ తన విజయాన్ని కొనసాగిస్తూ మూడో సెట్‌ను కూడా సులభంగా గెలుచుకున్నాడు. నాలుగో సెట్‌లో కూడా అల్కరాజ్ తన పట్టును కోల్పోలేదు. ఈ స్పెయిన్ ఛాంపియన్ ఐదో గేమ్‌లో సిన్నర్ సర్వీస్‌ను బ్రేక్ చేసి తన ఆధిక్యాన్ని కొనసాగించాడు.

# కబడ్డీ నా జీవితాన్నే మార్చేసింది

కబడ్డీ తన జీవితాన్నే మార్చేసిందని తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్ అన్నాడు. మారు మూల పల్లెటూరు నుంచి వచ్చిన తనకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందంటే దానికి ప్రధాన కారణం కబడ్డీ అని తెలిపాడు. ప్రొకబడ్డీ లీగ్ సీజన్ 12 క్యాంపైన్‌లో భాగంగా సోమవారం వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో తెలుగు టైటాన్స్ జట్టు సందడి చేసింది. టీమ్ ఆటగాళ్లంతా యూనివర్సిటీ విద్యార్థులతో చిట్ చాట్ చేసారు. తమ అనుభవాలను, కబడ్డీ ప్లేయర్లుగా ఎదిగేందుకు పడ్డ కష్టాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్ తన ప్రసంగంతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. తన జీవిత ప్రయాణం గురించి చెప్పి వారిలో స్ఫూర్తిని నింపారు. 'నేను చిన్న గ్రామం నుంచి వచ్చాను. కబడ్డీ నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ప్రస్తుతం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కబడ్డీ ఆటగాళ్లను జనాలు గుర్తిస్తున్నారు. ఇది మా కల సాకారమైందనే భావనను కలిగిస్తోంది. మరీ ముఖ్యంగా కబడ్డీ మా కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టే శక్తిని ఇచ్చింది. ఇదే మా అసలైన విజయం. పట్టుదలతో ప్రయత్నిస్తే అత్యంత



కఠినమైన పరిస్థితుల నుంచి కూడా ప్రపంచస్థాయికి చేరవచ్చని నా ప్రయాణంతో రుజువైంది.'అని విజయ్ మాలిక్ చెప్పుకొచ్చాడు. కబడ్డీ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, మన దేశ సంస్కృతని పీకేఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఈ ప్రసాద్ రావు అన్నారు. పల్లెటూరి ఆట అయిన కబడ్డీ ప్రొ కబడ్డీ లీగ్ కారణంగా ప్రపంచ స్థాయి ఆటగా ఎదిగిందని చెప్పారు. 'కబడ్డీ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు. ఈ దేశ సంస్కృతి, గుర్తింపు. ఒకప్పుడు ఒక సాధారణ పల్లెటూరి ఆటగా ప్రారంభమైన కబడ్డీ.. ప్రొ కబడ్డీ లీగ్ కారణంగా ప్రపంచ స్థాయి క్రీడగా ఎదిగింది. బీచ్‌ల నుంచి ఇండోర్ స్టేడియంల వరకు, ఏషియన్ గేమ్స్ నుంచి ప్రపంచ వేదిక వరకు కబడ్డీ అభివృద్ధి చెందింది. ఒలింపిక్స్‌లో భారత కబడ్డీ జట్టు బంగారు పతకం గెలుచుకునే రోజు ఎంతో దూరంలో లేదు. కోటీశ్వరులు కావాలంటే ప్రొ కబడ్డీ లీగ్‌లో చేరాలి.'అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు, విద్యార్థులతో కలిసి ఆటపాటలు, క్విజ్ కాంపిటిషన్‌లో పాల్గొన్నారు. కబడ్డీ ఆటకు అభిమానలను మరింత దగ్గరగా చేసే ప్రయత్నం ఈ కార్యక్రమం ద్వారా జరిగింది. ఆగస్ట్ 29న ప్రారంభమైన ప్రొ కబడ్డీ సీజన్ 12 దిగ్విజయంగా సాగుతోంది. ఈ సీజన్‌ను ఓటమితో ప్రారంభించిన తెలుగు టైటాన్స్ వరుసగా రెండు విజయాలతో జోరు మీదుంది. వైజాగ్ వేదికగానే తొలి దశ మ్యాచ్‌లు జరుగుతున్నాయి.




# ఒళ్లు మండుతోంది: శ్రేయస్

తుది జట్టులో ఆడే అర్హత ఉండి కూడా టీమ్‌లో అవకాశం దక్కకపోతే ఏ ఆటగాడైనా అసహనానికి గురవుతాడని టీమిండియా వెటరన్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. ఇలాంటి సమయాల్లో వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డాడు. ఆసియా కప్ 2025 కోసం ఎంపిక చేసిన భారత జట్టులో శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కని విషయం తెలిసిందే. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించినా.. భారత్ తరఫున వన్డేల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినా.. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత విజయంలో కీలక పాత్ర పోషించినా సెలెక్టర్లు అయ్యర్‌ను పట్టించుకోలేదు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేయని భారత సెలెక్టర్లు.. ఆసియా కప్ 2025 టోర్నీకి కూడా పక్కన పెట్టారు. తన వేటుపై మౌనంగా ఉన్న శ్రేయస్ అయ్యర్.. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో స్పందించాడు. సెలెక్టర్లపై తన అసహనాన్ని వెళ్లగక్కాడు. తుది జట్టులో ఆడే అర్హత ఉండి కూడా అవకాశం ఇవ్వకపోతే ఏ ఆటగాడికైనా మండుతదని తెలిపాడు. తుది జట్టులో ఆడే అర్హత ఉన్నా.. ఎంపిక చేయకపోతే అసహనం కలుగుతుంది. కానీ అదే సమయంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిలకడగా రాణిస్తూ జట్టు విజయానికి కృషి చేయాలి. మన పనిని నైతికతతో చేస్తూ వెళ్లాలి. ఎవరో చూస్తున్నారని కాకుండా.. నిబద్ధతతో పని చేసుకుంటూ ముందుకు సాగాలి. 'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.



## పంజాబ్ చెత్త యాజమాన్యం

'యూనివర్స్ బాస్'గా పేరుగాంచిన విధ్వంసకర బ్యాటర్ క్రిస్ గేల్, తన ఐపీఎల్ కెరీర్‌కు సంబంధించిన కొన్ని చేదు అనుభవాలను పంచుకుని సంచలనం సృష్టించాడు. పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ తనను అవమానించిందని, సీనియర్ ఆటగాడిగా తనకు దక్కాల్సిన గౌరవాన్ని ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పటి హెడ్ కోచ్ అనిల్ కుంబ్లే వైఖరి కూడా తనను బాధించిందని, అతడి ముందే కన్నీళ్లు పెట్టుకున్నానని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. క్రిస్ గేల్ మాట్లాడుతూ, "నా ఐపీఎల్ ప్రయాణం అనుకున్నదానికంటే ముందే ముగిసిపోవడానికి కారణం పంజాబ్ కింగ్స్ యాజమాన్యమే. వారు నన్ను చాలా అవమానించారు. లీగ్‌కు, ఫ్రాంచైజీకి ఎంతో విలువ తీసుకొచ్చిన నాకు కనీస గౌరవం కూడా ఇవ్వలేదు. నా జీవితంలో మొదటిసారి తీవ్రమైన డిప్రెషన్‌కు గురైనట్లు భావించాను. డబ్బు, సంపద కంటే మానసిక ప్రశాంతతే ముఖ్యమని నాకు ఆ సమయంలో అర్థమైంది" అని తన బాధను పంచుకున్నాడు. ఆ పరిస్థితుల్లో జట్టుతో కొనసాగడం తన మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని భావించి, మధ్యలోనే వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. ఆ క్లిష్ట సమయంలో జరిగిన ఓ సంఘటనను గేల్ గుర్తుచేసుకున్నాడు.

## బుల్స్ పట్టేశారు!

**బెంగళూరు ఘన విజయం**

**హర్యానా స్టీలర్స్ ఓటమి**

ప్రొ కబడ్డీ ప్రీమియర్ లీగ్(పీకేఎల్) సీజన్ 12లో బెంగళూరు బుల్స్ రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం వైజాగ్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 40-33 తేడాతో హర్యానా స్టీలర్స్‌ను ఓడించింది. బెంగళూరు తరఫున ఆల్‌రౌండర్ అలిరేజా 12 పాయింట్స్‌తో సత్తా చాటగా.. కెప్టెన్ యోగేష్(6), డిఫెండర్ దీపక్ శంకర్, రైడర్ ఆశిష్ మాలిక్(5) కీలక పాయింట్లతో రాణించారు. హర్యానా స్టీలర్స్‌లో మయాంక్ సైనీ(6), శివమ్ పడేలా(7) రాణించినా ఫలితం లేకపోయింది. మ్యాచ్ ఆరంభం నుంచే బెంగళూరు బుల్స్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. తొలి ఐదు నిమిషాల్లో హర్యానా స్టీలర్స్‌ను ఆలౌట్ చేసింది. ఆ తర్వాత హర్యానా పుంజుకొని బెంగళూరును ఆలౌట్ చేసింది. కానీ ఆధిక్యాన్ని అందుకున్న బెంగళూరు బుల్స్ ఫస్టాఫ్ ముగిసే సమయానికి 21-18తో మూడు పాయింట్స్ ఆధిక్యంలో నిలిచింది. హర్యానా స్టార్ రైడర్ నవీన్ కుమార్ గాయంతో తప్పుకోవడం ఆ జట్టు కొంపముంచింది. సెకండాఫ్‌లోనూ ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి.

ఈవార్తలు
# ప్రజావాణి
మంగళవారం 9-9-2025 | www.evarthalu.com



..........వివేక వాణి............

స్వార్థ రాహిత్యమే విశేష లాభదాయకం. కానీ దాన్ని అలవర్చుకొనే ఓర్పు జనానికి లేదు.

-స్వామి వివేకానంద

కాళోజీ జయంతి సందర్భంగా..

# కాళన్నా.. నువ్వు మళ్లీ రావాలన్నా!



అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి/ అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి .అంటూ ప్రజల గొడవను తన గొడవగా చెప్పినవాడు. పరుల కష్టం చూసి పగిలిపోవును గుండె /మాయ మర్మము చూసి మండి పోవును ఒళ్ళు అంటూ తన సున్నితపు మనసును ఆవిష్కరించిన మానవీయకవి, అన్నపు రాశులు ఒకచోట ఆకలి మంటలు ఒకచోట/ సంపదలన్నీ ఒకచోట గంపెడు బలగం ఒకచోట అంటూ సమసమాజ నిర్మాణానికి కదం తొక్కిన ఉద్యమవీరుడు .కోటిన్నర మేటి ప్రజల గొంతొక్కటి గొడవ ఒక్కటి/ తెలంగాణ నిలిచి గెలిచి ఫలించాలి భారతాన అని స్వప్నించిన ప్రజాకవి కాళోజీ.

పోరుగడ్డ ఓరుగల్లులో ఉద్భవించిన ఒక నిప్పుకణం దావానలంగా మారి యావత్ తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలను రేకెత్తించి వీర తెలంగాణ నుదుటన సింధూరమైన నిలిచింది. ఆ నిప్పుకణం పేరు కాళోజీ. మనిషి జీవితంలో ఉద్యమం ఒక భాగం కావడం సహజం కానీ జీవితమే ఉద్యమంగా మారడం కేవలం కాళోజీలోనే చూసాం. నిజాం రాజ్యాన్ని ప్రతిఘటించడం దగ్గర నుండి నక్సలైట్లపై హింసను ఖండించే వరకు ఆయన అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నారు ఆర్య సమాజ్ కార్యకలాపాలు, గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభ, భారత స్వాతంత్ర్య పోరాటం, హైదరాబాద్ విమోచన ఉద్యమం, ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం, పౌర హక్కులు, తెలంగాణ ఉద్యమం.. ఇలా ఈ గడ్డను తాకిన, శాసించిన ఏ ఉద్యమానికైనా కాళోజీ తన రెండు చేతులతో ఆహ్వానం పలికి ఆవాహనం చేసుకున్నాడు. ఉద్యమకారుడుగానే మాత్రమే కాక కవిగా, కథకుడిగా ఉద్యమాలకు ఆలంబనయ్యాడు. ఈ క్రమంలో మూడుసార్లు జైలు జీవితం అనుభవించాడు. కాళోజీ ఒక బక్క పలుచని మనిషి అయినా ఆయన శరీరంలో వజ్రతుల్యమైన ఒక దీక్ష, ప్రచండ వాయువు లాంటి ఆవేశం దాగి ఉన్నాయి. 1914 సెప్టెంబర్ 9న ఇప్పటి కర్ణాటకలోని బీజాపూర్ జిల్లాలోని రెట్టిహళ్లి గ్రామంలో ఆయన జన్మించాక కుటుంబం అక్కడి నుంచి వరంగల్ జిల్లాలోని మడికొండకు వచ్చి స్థిరపడింది. తల్లికి ద్వితీయ పుత్రుడిగా తెలంగాణ తల్లికి అద్వితీయ పుత్రుడు. జీవిత పరిశీలన, పోరాటానుభవాలు కాళోజీ లోగాఢమైన తాత్విక దృష్టికి కారణమైనాయి. తల్లి నుంచి, తండ్రి నుంచి, సానెగురూజీ నుంచి కన్నడ మరాఠీ తెలుగు రక్త సంబంధాల మూలాల నుంచి ఆయన అస్థిగతంగా ఉన్న ఈ జీవన తత్వం గార్లపాటి రాఘవరెడ్డి శిష్యరికం వల్ల బలపడింది. పోరాట నిరాడంబరత ఆయన జీవితం. నైసర్గికమైన జీవధాతువులను, వ్యక్తీకరణలను, సంభాషణలో భాషతో సహా కాపాడుకున్న వాడు కాళోజీ. ఆయన సంభాషణలో తెలంగాణ యాస భాష ఎంతో సహజంగా, స్వచ్ఛంగా, సరళంగా ఉంటాయి. కవిగా, అనువాదకుడిగా ఆయన పండితులను, సాహిత్య విమర్శకులను చాలా గౌరవంగా చూడటం ఆశ్చర్యం. విశ్వనాథ సత్యనారాయణ భావజాలంతో ఎంత విభేదించేవాడో.. ఆయన వ్యక్తిత్వాన్ని, పాండిత్యాన్ని అంత గౌరవించేవాడు. ఆయనకు ప్రత్యేక ఆస్తి అంటూ ఏమీ లేదు. చిన్నప్పటి నుంచి అన్న అయిన రామేశ్వరరావు ఆయన అవసరాలను తీర్చుకుంటూ వచ్చాడు. అప్పట్లో తెలంగాణ గడ్డపై సమాంతరంగా సాగిన పలు ఉద్యమాలకు కాళోజీ ఇల్లు కేంద్రంగా ఉండేది. ఈ ఉద్యమాలన్నీ సామాజిక జీవితంలోకి తెచ్చిన విలువలలోని మంచిని స్వీకరించడం వల్ల కావచ్చు కాళోజీకి తనదైన విశిష్ట వ్యక్తిత్వం అలబడింది. సమాజ సంఘర్షణల వెంట నడిచిన వ్యక్తి కాబట్టే కాళోజీ మన హృదయాలలో సుస్థిర స్థానం స్థాపించుకున్నాడు. కవులు విమర్శకులు చెప్పుకునే భాష, భావం, శిల్పం, ధ్వని, అలంకారాలు ఇలాంటివి పట్టించుకోకుండా తాను చెప్పదలుచుకున్నది కుండబద్దలు కొట్టినట్లు చెప్పడమే కాళోజీ కవిత్వం. ఆయన ఎజెండా కేవలం ప్రజలు. వాళ్లకు ఏమాత్రం ఇబ్బంది కలిగినా అవతల వ్యక్తి ఎంత పెద్ద నాయకుడైనా, ఎంత ఆత్మీయుడైనా, ఎంత ధనవంతుడైనా, చివరికి ఆ భగవంతుడే ఉన్నా కాళోజీ ఎదిరించి తీరుతాడు. ఈ లక్షణాలే కాళోజీని ప్రజాకవి చేసింది. కాళోజీ బయటకు ఎంత గంభీరంగా ఉండేవారో లోపల అంత సున్నితమైన హృదయం ఆయనది. అతి చిన్న విషయాలకు కూడా తీవ్రంగా చలించిపోయేవారు. ఆయన మిత్రులు, ఉద్యమ నేతలు, కవులు, కళాకారులతోనే రోజంతా మాట్లాడుతూనే ఉండేవారు. వాళ్ళు ఉన్నప్పుడు ఆయన ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా కనిపించేవారు. వారు లేనప్పుడు ఒక్కసారిగా మౌనిలా మారిపోయేవారు. పుస్తకాలు చదువుకోవడం, లేదంటే ఒక్కడే పేక ముక్కలు వేసుకుని ఆడేవాడు. అన్నింటికీ మించి ఆయనకు క్రికెట్ అంటే ప్రాణం. సచిన్ టెండుల్కర్ అంటే ఆయనకు విపరీతమైన అభిమానం. ప్రజాస్వామిక లక్షణాలన్నీ నిలువెల్లా వంట పట్టించుకున్న కవి కనుక కాళోజీస్వరం ఇతరులతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. పసిపిల్లాడిలా స్పందించే మనిషి కాళోజీ. కోపం వస్తే కోపంగా, బాధనిపిస్తే బాధగా, ప్రేమ అనిపిస్తే ప్రేమగా, అసహ్యం అనిపిస్తే అసహ్యంగా, అబ్బురం అనిపిస్తే అబ్బురంగా, సంబురం అనిపిస్తే సంబురంగా, ఏడుపొస్తే ఏడ్చి సహజంగా జీవించిన మేటిమనిషి కాళోజీ. మనిషంతా సహజత్వమే. ఏ విషయమైనా కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడటం వల్ల సూటిగా తాకుతుంది. వర్తమాన వాస్తవాన్ని పురాణ ప్రతీకలతో హత్తుకునేలా చెప్పడం కాళోజీలా మరొకరికి సాధ్యం కాదు. ప్రజల హక్కుల కోసం తాపత్రయపడి వారి పోరాటాలకు జీవితాలకు, వ్యక్తిత్వాలకు పెద్దదిక్కుగా నిలబడ్డారు. కాళోజీ లాంటి వ్యక్తులు అరుదుగా జన్మిస్తారు. ఒక కన్ను అన్యాయాన్ని చూసి సహించలేక నిప్పులు కురిపిస్తుంది, ఇంకొక కన్ను ప్రజల సంవేదనలను జీర్ణించుకోలేక కన్నీరు కారుస్తుంది. ఈ రెండు పార్శ్వాలు ఒకే వ్యక్తిలో ఉండటం బహుఅరుదు. అటువంటి అరుదైన వ్యక్తి కాళోజీ. బడి పలుకుల భాష కాదు.. పలుకుబడుల భాష కావాలని తెలంగాణ యాసలో కవిత్వాన్ని కథలను రాసిన కవి. ఒకే ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అయితే నేను వలకబోసిన పీపాల సిరా ఏ ఒక్క మెదడును కదిలించినట్లు లేదని కాళోజీ వాపోతాడు. రాసింది దాచుకోవడం చేతకాని కవి. కవిత్వం తన్నుకొస్తుంటే దొరికిన సిగరెట్ పెట్టె చించి దాని వెనుక ఉన్న తెల్ల అట్ట మీద కవిత్వం రాసేవాడు. అలా రాసి పోగొట్టుకున్న కవితలు అనేకం. 1992వ సంవత్సరంలో భారత దేశంలో రెండవ అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్ పొందారు. అతిథి ఓలా వచ్చినాను అతిథి ఓలే పోతానని అన్నాడు గాని పరిచయమైన మరుక్షణం నుంచి ఆయన ఎదుటి వాళ్ళతో జీవిత సహచరుడిగా మారిపోతాడు. నవంబర్ 13, 2002వ సంవత్సరంలో వరంగల్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన తన దేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అంకితం చేశారు.

కాళోజీ అంటే నిర్భీతికి ప్రతీక, ఓ ధిక్కార స్వరం, ఓ చెమ్మగిల్లిన కన్ను, ఓ ప్రవక్త, ఓ ప్రజాకవి. ఒక్క మాటలో చెప్పాలంటే ఓ నిఖార్సైన తెలంగాణ బిడ్డ. ఆయనను స్మరించుకోవడం అంటే.. ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన వదిలిన వెళ్లిన విలువలను గౌరవించడం, అంతకుమించి ఆచరించడం. అలా ఆచరించగలిగినప్పుడే కాళోజీకి నిజమైన నివాళి సమర్పించినట్లు అవుతుంది. ప్రాంతం వాడే దోపిడి చేస్తే ప్రాణంతోనే పాతరేస్తాం అన్న ఆయన ఉద్యమ భావన ఇంకా మిగిలి ఉంది. ఈ మిగిలిన దాన్ని తెలంగాణ ప్రజలు ఆఖరి గొడవగా ఉద్యమించవలసింది ఇంకా ఉండనే ఉంది. ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను పరిరక్షించే బాధ్యత మనకు ఉందంటూ కాళోజీ ఎల్లప్పుడూ మనకు గుర్తు చేస్తూనే ఉంటాడు.



**ములుక సురేశ్**
తెలంగాణ వికాస సమితి
9441327666

దేశ రక్షణలో కీలకపాత్ర వహించే త్రివిధ దళాలైన సైన్యం, నావికాదళం, వాయుసేన ప్రవేశాల్లో తెలుగు రాష్ట్రాల యువత నియామకం చాలా తక్కువ సంఖ్యలో ఉండి వెనక బడుతోంది.మన రాష్ట్రము పక్కనే ఉన్న కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ తో పోలిస్తే తెలంగాణ నుంచి రక్షణ దళాల్లోకి ఎంపికవుతున్న వారి సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. దేశరక్షణకు పని చేయుచున్న త్రివిధ దళాల్లో ప్రవేశాల విషయంలో "ఉత్తరప్రదేశ్" దేశంలోనే మొదటి స్థానంలో ఉంది.

# ఆర్మీ.. అందుకోని యువత!





**గడప రఘుపతిరావు**
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282
raghupatiraog@gmail.com

భారత సాయుధ దళాలు భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహణలో ఉన్నాయి. 1.4 మిలియన్లకు పైగా రక్షణ సిబ్బంది బలంతో, ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద సైనిక దళంగా, ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సైన్యాన్ని కలిగిన దేశంగా మరియు ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద రక్షణ బడ్జెట్‌ను కూడా కలిగిన దేశంగా ఉన్న చరిత్ర మన దేశానిది. అయినప్పటికీ త్రివిధదళాల్లో మన తెలుగు యువత చేరక పోవడానికి ముఖ్యకారణంగా యువతకు మరియు తల్లిదండ్రులకు ఉన్న "అపోహలు" మరియు "అవగాహన లేకపోవడం" ప్రధాన కారణంగా గమనించవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఉండే యువత మొదటి నుండి కొన్ని కోర్సులు చేయడం కొరకు మాత్రమే అవగాహన కల్గి వాటిపై మాత్రమే దృష్టి పెడుచున్నారు. యువత కొన్ని ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకొని ఆ వైపే ఎక్కువగా దృష్టిపెట్టడం దానికితోడు తల్లిదండ్రులు కూడా అలాంటి ఉద్యోగాలను తమ పిల్లలకు దక్కేలా ప్రోత్సహించడం వల్ల త్రివిధదళాల్లో నియామకాల గురించి ఎవరూ ఆలోచించడం లేదు. త్రివిధ దళాల్లో కొలువుల్లో చేరితే ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండవని, ఎప్పుడు కూడా భయం భయంగా ఉండాల్సి ఉంటుందని, దూర ప్రాంతములో పనిచేయవలసి వస్తుందని, సరియైన సెలవుల సౌకర్యం కుడా ఉండదనే లాంటి కొన్ని అపోహల వల్ల తెలుగు రాష్ట్రాల్లో యువత త్రివిధ దళాల్లో చేరుటకు ఇష్టపడడం లేదని ఓ సర్వేలో తేలింది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి, అందుబాటులో ఉంటేనే మిత్రులు మరియు బంధువులు ప్రభుత్వ ఉద్యోగులుగా చూస్తుంటారని యువకులు భావించడం వల్ల ఈ నియామకాల వైపు ఆశక్తి చూపడం లేదు. రక్షణ దళాల్లో ఉద్యోగ మంటే సరిహద్దుల్లో నిత్యం యుద్ధం చేస్తుండాలనే ఆపోహలూ కూడా వెనుక బాటుకు కారణమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

గత రెండుమూడు దశాబ్దాలుగా పరిశీలిస్తే తెలుగు రాష్ట్రాల్లో కోచింగ్ సెంటర్లు అలాంటి ఉద్యోగాలకే ఎక్కువమంది విద్యార్థులు, యువత ఆసక్తి చూపడం వల్ల వారికి సరిపడే సెంటర్లు ప్రారంభిస్తున్నారు. ఒక వేళ అందులో సెలెక్ట్ కాకున్నా మరో వ్యాపారం వైపు చూస్తున్నారు కానీ రక్షణరంగం వైపు వెళ్ళడం లేదు. సాఫ్ట్ వేర్, డాక్టర్స్ , సివిల్స్,బ్యాంకింగ్ తదితర పరీక్షల వైపు యువత ప్రయత్నిస్తుందని,ఒక వేళ వీటిలో ఎన్నిక కాకపోయినా రక్షణ దళంలో చేరే ఆలోచన చేయడం లేదని నిపుణులు భావిస్తున్నారు. రక్షణ దళాలకు సంబంధించి అవగాహన పెంచేందుకు కోచింగ్ సంస్థలు పెరగాల్సి ఉందని, ఐఐటీలు, జేఈఈ, ఎంసెట్,ఎంబిబిఎస్, లాగానే ఇంటర్ పూర్తి కావడం తోనే "నేషనల్ డిఫెన్స్ అకాడమీ" త్రివిధదళాల్లో చేరికపై దృష్టి పెడితే ఎన్నికైన వారు ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, వారికి కల్పించే సౌకర్యాలు ఐఏఎస్ అధికారులకు కూడా ఉండవని యువతకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజల్లో ముఖ్యంగా తల్లిదండ్రుల్లో రక్షక దళాల పట్ల సదావగాహన కల్గించుటకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారత సాయుధ దళాలైన " సైన్యం, నేవీ, వైమానిక దళం" కాక అదనంగా సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్, అస్సాం రైఫిల్స్, ఇండియన్ కోస్ట్ గార్డ్, స్పెషల్ ఫ్రాంటియర్ ఫోర్స్, స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్, అండమాన్, నికోబార్ కమాండ్, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ వంటి వివిధ ఇంటర్-సర్వీస్ కమాండ్‌లు కూడా ఉన్నాయి. భారత రాష్ట్రపతి భారత సాయుధ దళాలకు సుప్రీం కమాండర్ అయితే జాతీయ భద్రతకు సంబంధించిన కార్యనిర్వాహక అధికారం మరియు బాధ్యత భారత ప్రధానమంత్రితో పాటు రక్షణ మంత్రికి కూడా ఉంటుంది. ఇంత గొప్పగా దేశానికి సేవచేసే భాగ్యం కలిగి ఉన్న త్రివిధదళాల్లో యువత చేరేలా మన తెలుగు యువతను ప్రోత్సహించే భాధ్యత మరియు అవగాహన పెంచే బాధ్యత మన రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.